## టెక్నికల్ డిప్లమా కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మే 13, ప్రభాతవార్త:**
ప్రభుత్వ ఆదేశా నుసారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ సంస్థ హైదరాబాద్‌లో 3సంవత్సరాల టెక్నికల్ డిప్లమా కోర్సులకు 2025-26 సంవత్సరానికిగా ను తల్లిదండ్రులను కోల్పోయిన అనాథబాలికలు, అక్రమరవాణాకు గురైన దివ్యాంగుల బాలికల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జయసుధ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి కోర్సులో 60 సీట్లకు గా ను, మొత్తం 240 సీట్లలో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథబాలికలు, తండ్రిని కోల్పోయిన నిరుపేద బాలికలకు కేటాయించబడుతాయని పేర్కొన్నారు. ఇటువంటివారు పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష రాయకున్నా కనీసం పదవతరగతి ఉత్తీర్ణతపొంది ఉండాలని, 3 శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించడం జరిగిందని, దరఖాస్తు కొరకు కులము, ఆదాయ ధ్రువీకరణ, బోనఫైడ్ సర్టిఫికెట్, దరఖాస్తుఫారంనకు జతచేసి మే 20 తేదీలోపు సమర్పించవలె నని పేర్కొన్నారు. ఇతర వివరాలకు బాలరక్షభవన్ అధికారి 9640863896, 9849672296 ఫోన్‌నెంబరుకు సంప్రతించాలని తెలిపారు.

# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
# వార్త

## పంటల సాగుపై రైతులకు శాస్త్రవేత్తల అవగాహన

**శామీర్‌పేట్, మే 13, ప్రభాతవార్త:**
వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించి రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులను అవలంబించాలని శామీర్‌పేట్ సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేట్, మురహరిపల్లిలో మంగళవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ బేబి ఆకుల, డాక్టర్ లావణ్య, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శ్రీరంజితలు పాల్గొని రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు పంటమార్పిడి చేపట్టాలని, మోతాదుకు తగిన యూరియా మాత్రమే వాడాలని, నాణ్యమైన విత్తనాలను వాడాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువులు వేయాలని, వరి పంటలో తెగుళ్లు, పురుగులు తట్టుకునే రకాలు విత్తుకోవాలన్నారు. సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు శాస్త్రవేత్తల తెలియజేసిన విషయాలపై అవగాహన కల్పించుకొని పంటసాగులో మెలకువలు పాటించడం ద్వారా పంట దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారి రమేశ్, ఏఈఓలు రవి, సుధీర్, సొసైటీ వైస్ చైర్మన్ అయిలయ్య, డైరెక్టర్ బూంరెడ్డి, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైనవారికి ఇందిరమ్మ ఇళ్లు

-ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి



ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలిస్తున్న రాంమోహన్‌రెడ్డి

**దోమ, మే 13, ప్రభాతవార్త:**
అర్హులైన ప్రతివారికి ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వలక్ష్యం అని పర్గి ఎమ్మెల్యే టి. రాంమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం దోమ మండలపరిధిలోని శివారెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లనిర్మాణం పనులను పరిశీలించారు. ఈసందర్భముగా ఆయన మాట్లాడుతూ బేస్‌మెంట్‌వరకు పనులు పూర్తిచేసుకున్న లబ్దిదారులకు వెంటనే ఒకలక్షరూపాయలు అందిస్తామని అన్నారు. గ్రామములో ఇంటి నిర్మాణంచేస్తున్న లబ్దిదారులకు అధికారులు అందుబాటులో ఉండి సూచనలు సలహాలు ఇవ్వాలని అధికారులకు తెలియజేశారు. ఇళ్లులేని పేదవారికి విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయబడతాయని ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయినవారు ప్రభుత్వం అందించే సహాయంతో నాణ్యతతో ఇంళ్లనిర్మాణం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో హౌజింగ్ అధికారులు, పర్గి మార్కెట్ కమిటీ చైర్మెన్ పరుశురాంరెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మెన్ యాదవరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, మొగులయ్య, రమేశ్‌గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**కొందుర్గు, మే 13, ప్రభాతవార్త:**
రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రైతులను కోరారు. మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్, వెంకిర్యాల గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపరమైన సమస్యలు లేకుండా చేయాలనే ఆశయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి దానికి చట్టబద్ధత కల్పించారని అన్నారు. రైతులందరు భూసమస్యలను సదస్సులకు వచ్చి లిఖిత పూర్వకంగా సమర్పించాలని సూచించారు. అధికారులు వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్క రించేందుకు కృషి చేస్తారని అన్నారు. ఈసదస్సులో ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్లు కె.రమేష్‌కుమార్, జగదీశ్వర్, కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు మల్లేష్‌గౌడ్, లంకాల రామకృష్ణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కుర్వ మల్లయ్య, మాసయ్యగౌడ్, లింగమయ్యగౌడ్, పసుల నర్సింలు, దాసరి నర్సింలు, ఊశయ్య, చెక్కల రమేష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## ఆటోనగర్ ఏర్పాటుకు కృషి

-ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కలిసిన మెకానిక్ అసోసియేషన్ సభ్యులు

**తాండూరు, మే 13, ప్రభాతవార్త:**
ఆటోనగర్ ఏర్పాటుకు కృషిచేస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరులో ఏర్పాటుకు కృషి చేయాలని మంగళవారం మెకానిక్ అసోసియేషన్ సభ్యులు హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో ఉన్న తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తాండూరులో ఆటోనగర్ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తు తున్నాయని అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వారి విజ్ఞప్తి మేరకు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి హైదరాబాద్ రోడ్డు మార్గంలో త్వరలో అధునాతన వసతులతో ఆటోనగర్ అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

## నకిలీ ఐస్‌క్రీమ్‌లు తయారుచేస్తున్నవారిపై కేసునమోదు

-కాలంచెల్లిన రసాయనాలతో ఐస్‌క్రీములు తయారీ
-ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం
-కఠినచర్యలు తప్పవు: కుల్కచర్ల ఎస్ఐ అన్వేష్‌రెడ్డి



నకిలీ ఐస్‌క్రీమ్‌లు తయారుచేస్తున్న వ్యక్తులు వీరే

**కుల్కచర్ల, మే 13, ప్రభాతవార్త:**
నకిలీ ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం కుల్కచర్ల మండలకేంద్రంలోని తపాలా కార్యాలయం పక్కన ఓ అద్దె ఇంట్లో కొందుర్గు మండలానికి చెందిన అజీమ్ అనేవ్యక్తి బీహార్‌కుచెందిన అనిల్, రాంపాల్‌తో కలిసి కాలంచెల్లిన రసాయనాలతో ఐస్‌క్రీమ్‌లు తయారుచేసి ఊళ్ళూరాతిరుగుతూ అమ్ముతున్నారనే సమాచారంతో అక్కడికి చేరుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని వారిని పోలీసులకు అప్పగించారు. ఈముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజల ప్రాణాలకు ముఖ్యంగా చిన్నపిల్లల ప్రాణాలకు హాని కలిగించే హానికర రసాయనాలు, కలర్స్‌తో ఐస్‌క్రీమ్ తయారుచేస్తే ఉపేక్షించేది లేదని, ఎంతటివారైనా చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ

-అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**వికారాబాద్, మే 13, ప్రభాతవార్త:**
గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కోసం పెద్ద మొత్తంలో రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మోమిన్‌పేట మండలంలో రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాప నలు చేశారు. ఈసందర్భంగా రాళ్ళగుడుపల్లినుండి గుట్టమీది తాండా వరకు రూ.2.40కోట్లతో విలువ గల గిరిజన అభివృద్ధి ప్రత్యేక నిధులతో చేపట్టిన బిటిరోడ్డు, ఉపాధిహామీపథకంకింద రాళ్ళగుడుపల్లి లో రూ.15లక్షల వ్యయంతో, లచ్చునాయక్‌తాండా లో రూ.20లక్షల సిసి రోడ్డు, మోమిన్‌పేట్ మండల కేంద్రంలో రూ.1.05 కోట్లతో సిసి రోడ్డులను స్పీకర్ ప్రారంభించారు. మోమిన్‌పేట్ లో ఇందిరమ్మ ఇల్లు నమూనా నిర్మాణానికి భూమి పూజ, బిక్కరెడ్డి గూడెంకు రూ.3 కోట్ల వ్యయంతో చేపట్టే బిటి రోడ్డు, మల్లారెడ్డిగూడెం మొండి కట్ట వాడుక చెరువుకు రూ.16.85 లక్షల వ్యయంతో చేపట్టే మరమ్మతుల ప నులకు శంకుస్థాపన చేశారు. వెల్చాల్‌లో రూ.55లక్షలు, దుర్గంచెరువు లో రూ.50లక్షలు, మొరంగపల్లిలో రూ.45 లక్షలు, ఇబ్రాచిట్టెంపల్లిలో రూ.30లక్షలు, కేసారంలో రూ.30 లక్షలు, ఎన్కేపల్లిలో రూ.45 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్లకు స్పీకర్ ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటు లో ఉంటూ సమస్యలపరిష్కారానికి కృషి చేస్తాన న్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథ కాల ు సద్వినియోగం చేసుకోవాలని, అందుకు అధికారులు కృషిచేయాలని సూచించారు. ఇంది రమ్మ నమూనా భవనాన్ని అతి తొందరలో పూర్తి చేయాలని సంబంధిత డిఈని స్పీకర్ ఆదేశిం చారు. వెల్చాల్‌గ్రామంలో రేషన్‌కార్డులు, సన్న బియ్యం సరఫరాపై మహిళలను అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా ఆర్థికసహాయాన్ని అందిస్తుందని, దీనిద్వారా యువత ఉపాధి కల్పించుకోవచ్చని



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ఆయనసూచించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ రాజ్‌శాఖ ఇఇ ఉమేష్, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపిడిఓ విజయ లక్ష్మి, హౌసింగ్ డిఈ, ఇఇ సయ్యద్ సాజిద్, శిరా జుద్దీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, స్థానికనాయకులు, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'స్థానిక' సమరం ఇప్పట్లో లేనట్లే..!

-గ్రామాల్లో కుంటుపడుతున్న పాలన, ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకత
-కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచేది ఎప్పుడో, ఎన్నికలకు సిద్ధం అంటున్న అధికారులు



గ్రామపంచాయితీ

**రంగారెడ్డిఅర్బన్, మే 13, ప్రభాతవార్త:**
ఒకవైపు ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లతో సర్వంసన్నద్ధమైనా సామాజిక వర్గాల రిజర్వేషన్లు బ్రేక్ వేస్తున్నాయి. ప్రధానంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల పంచాయతీ తేలే వరకు స్థానిక ఎన్నికలు జరిగే సంకేతాలు కనిపిం చడంలేదు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎన్నికలను ఊరిస్తూ వాయిదాలు వేస్తోంది. పంచాయతీ ఎన్ని కలపై అయోమయం, స్థానికపోరు ఇప్పట్లో రానం టున్నాయ్.. కేంద్ర ప్రభుత్వం జనగణనతోపాటు కులగణన కూడా చేపట్టే అవకాశాలు ఉండడంతో గ్రామపంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే అని అభిప్రాయంతో ఆశావహులు నిరాశ చెందుతు న్నారు. స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్ 42శాతా నికి పెంచేందుకు సవరణ కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించారు. సవరణ కావాలంటే పార్లమెంట్‌లో బిల్లు పాస్ చేయాల్సి ఉంటుంది. కేంద్రం ఈప్రక్రియ ఇంకా మొదలు పెట్టకపోయినా రాష్ట్రప్రభుత్వం జూలైలో ఎన్నిక లంటూ ఆశలు కల్పిస్తున్నారు. దీంతో ఎలక్షన్ల కోసం ఎదురుచూస్తున్న ఆశావహులు అయో మయంలోపడ్డారు. 2024జనవరిలో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీ కాలం ముగిసినా ఎన్నికలపై ఇప్పటికీ గందరగోళ పరిస్థితి వీడటం లేదు. ప్రస్తుత రిజర్వేషన్ల పరిస్థితుల్లో మరో ఆరు నెలల పాటు ప్రత్యేక అధికారులపాలన కొనసాగే అవ కాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో గ్రామ పంచా యతీ ఎన్నికలతోపాటు మున్సిపల్,జిల్లా,మండల పరిషత్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధమే అంటూ అధికారులు ఆశావహులు ఉన్నారు. అధి కార యంత్రాంగం ఓటర్ జాబితాతో పాటు ఇతర ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎన్నికల కమిషన్ గుర్తుల తోపాటు సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచారు. రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వం చెప్పినట్లు జూలైలో ఎన్నికలు వచ్చినా అధికార యంత్రాంగం మాత్రం గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధంగా ఉన్నారు. రంగారెడ్డి జిల్లాలో 531 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఓటరు జాబితా రెడీ. 531 గ్రామపంచాయతీల్లో 7లక్షల 39వేల 674 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్క తేల్చారు. ఇందులో పురుషులు 371960మంది, మహిళలు367883 మంది, 31మంది ట్రాన్స్‌జెండర్ ఓట్లు ఉన్నాయి. జిల్లాలోని గ్రామపంచాయితీలో 4710 వార్డులు ఏర్పాటు చేశారు. 4724 పోలింగ్ బూత్‌లను గుర్తించారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్ అభ్యర్థులకు 30గుర్తులు, వార్డు సభ్యుల అభ్యర్థులకు 20గుర్తులు కేటాయించారు. సర్పంచ్ లకు సంబంధించి పింక్ కలర్ బ్యాలెట్ పత్రం, వార్డు సభ్యులకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాన్ని సిద్ధం చేస్తున్నారు. సర్పంచ్‌ల ఎన్నికల గుర్తుల్లో ఉంగరం, కత్తెర, పుట్‌బాల్, బ్యాట్, బ్యాట్స్‌మెన్, స్టంప్స్, లేడీపర్స్, టివిరిమోట్, టూత్‌పేస్ట్, పాన్, చెత్తడబ్బా, బెండకాయ, కొబ్బరిచెట్టు, వజ్రం, నల్ల బోర్డు, బకెట్, డోర్‌హ్యాండిల్, చేతికర్ర, మంచం, బిస్కెట్, వేణువు, జల్లెడ, పలక, టేబుల్, బ్యాటరీలైట్, బ్రష్, పడవ, చైన్, చెప్పులు, గాలిబుడగ తదితర గుర్తులు ఉన్నాయి. వార్డుసభ్యులకు సంబంధించి పొయ్యి, స్టూల్, బీరువా, గ్యాస్‌సిలెండర్, గౌన్, ఈల, కుండ, గరాట, మూకుడు, డిష్‌ఏంటీనా, ఐస్‌క్రీమ్, గాజుగ్లాస్ పోస్ట్‌డబ్బా, కవర్, కటింగ్‌ప్లేయర్, హాకీ, కర్రబంతి, నెక్‌టై, విద్యుత్‌స్తంభం, షటిల్ గుర్తులు కేటాయిం చారు. గుర్తుల్లో కొన్ని గుర్తుంచుకోవడం కష్టమే అన్నట్లుగా భావిస్తున్నారు.

# ఇంచార్జ్ సర్వేయర్‌తో ఇబ్బందులు

-సమయానికి రారు సర్వే చేయరు
-పెండింగ్‌లో ఉన్న 55 దరఖాస్తులు
-ఆందోళనలో ఆయా గ్రామాల ప్రజలు

**పెద్దేముల్, మే 13, ప్రభాతవార్త:**
ఇంచార్జ్ సర్వేయర్‌తో ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. జనవరి నుంచి ఇప్పటి వరకు 55 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం తాండూరు మండలానికి సర్వేయర్‌గా ఉన్న మహేష్ పెద్దేముల్‌మండలానికి ఇంచార్జ్‌గా కొనసాగుతున్నారు. రెండుమండలాలకు సర్వేయర్‌గా ఉన్న ఆయన ఎప్పుడు మండలానికి వస్తారో ఎప్పుడు వెళతారో తెలియక జనాలు అవస్థలు పడుతున్నారు. దరఖాస్తులు చేసు కొని నాలుగునెలలు గడుస్తున్నా ఇంతవరకు తమ భూములను సర్వే చేయడంలేదని పలువురు చెబుతున్నారు. చాలామంది ప్రజలకు సర్వేయర్ ఎవరో కూడా తెలియదు. ఎందుకంటే ఆయన మండల కార్యాలయంలో కనబడిన దాఖలాలు లేవని మండిపడుతున్నారు. సర్వేకోసం చెప్పులు అరిగేలా కార్యా లయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. తమ భూములను ఎప్పుడు సర్వే చేస్తారో



పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయం

తెలియడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెద్దేముల్ మండలానికి ఇంచార్జ్ సర్వేయర్‌నుకాకుండా పర్మనెంట్ సర్వేయర్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

# భూసమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలి

-అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



దరఖాస్తుల ు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**ధారూరు, మే 13, ప్రభాతవార్త:**
భూసమస్యలు ఏమైనా ఉంటే భూభారతి రెవె న్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దోర్నాల్, గురుదోట్ల, కుమ్మరిపల్లి గ్రామాలలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును వికారాబాద్ డివిజన్ రెవెన్యూ అధికారి వాసుచంద్రతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అధికారులు అంకితభావంతో పనిచేసి భూముల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ఆయనతోపాటు ధారూర్ తహసీల్దార్ సాజిదాబేగం, దీపక్‌శాంసన్‌దాస్, శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, సీనియర్ అసిస్టెంట్ ప్రకాష్, రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

**భూ భారతి రెవె న్యూ సదస్సులో మొత్తం 35 దరఖాస్తులు..**
మండల పరిధిలో గురుదోట్ల, కుమ్మరిపల్లి,దోర్నాల్ గ్రామాలలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో మొత్తం 35 దరఖాస్తులు వచ్చాయని తహసిల్దారు సాజిదా బేగం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బుధవారం మండల పరిధిలోని ము న్నూరు సోమరం, కుక్కింద గ్రామాలలో నిర్వహిస్తున్నామని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### మిల్లులకు ధాన్యం వెంటనే పంపాలి..

రైస్ మిల్లులకు ధాన్యం వెంటనే పంపాలని సెంటర్ ఇంచార్జ్ లకు వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలుకేంద్రాన్ని ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు వికారాబాద్‌జిల్లాలో 128వరి కొనుగోలుకేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు 17,459,920 మెట్రిక్ ట న్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొ నుగోలుచేసి సుమారు రూ.18 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. కొ నుగోలు చేసిన వరిని రైస్‌మిల్లులకు పంపినట్లు సెంట్రింగ్ తెలిపారు. ఆయనతో పాటు డిఎస్ఓ మోహన్‌బాబు, డిటిసిఎస్ శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

**కేశంపేట, మే 13, ప్రభాతవార్త:**
పురుగులమందు తాగి వ్యక్తి మృతిచెందిన ఘటన కేశంపేట మండలపరిధి లోని తొమ్మిదిరేకుల గ్రామంలో చోటుచేసుకుంది. కేశంపేట సిఐ నరహరి తెలి పిన వివరాల ప్రకారం, కేశంపేట మండలపరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన నాగిళ్ల అంజయ్య వయసు 45 సంవత్సరాలు, గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడని కడుపునొప్పి భరించలేక గత శనివారం తేదీ 10.5.2025 మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారకమందుతాగి పడిఉన్నాడని పక్కింటివారు, అంజయ్య కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా అంజయ్య భార్య, కుటుంబ సభ్యులు కలిసి చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనలమేరకు మెరుగైనచికిత్స నిమిత్తం హైదరాబాద్ ఉస్మానియా ఆసు పత్రికితరలించారు. నాగిళ్ల అంజయ్య చికిత్సపొందుతూ సోమవారం ఉదయం దాదాపు 10గంటల 17నిమిషాలకు చనిపోయినట్లు ఉస్మానియా వైద్యులు తెలిపారు. మృతుడిభార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరహరి తెలిపారు.

## హత్యకేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు

-వికారాబాద్ జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి

**కోట్‌పల్లి, మే 13, ప్రభాతవార్త:**
హత్యకేసులో ముగ్గురు నిందితులకు జీవితఖైదు పడిన సంఘటన కోట్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే 2014లో డిసెంబరు 5న కోట్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో హత్యకేసులో మగ్గురునిందితులకు జీవిత ఖైదు విధిస్తూ గౌరవ ప్రిన్సిపాల్ డిస్ట్రిక్, సెషన్స్ జడ్జి డా.సున్నం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తీర్పు ఇచ్చినట్లు వికారాబాద్‌జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి తెలి పారు. కోట్‌పల్లి మండల పరిధిలోని ఇందోల్ గ్రామానికి చెందిన బాసుపల్లి పెంటప్ప, తన తమ్ముడు తమ పాలివారైన బాసుపల్లి అంజిలప్ప కుటుంబంతో తరచూ ఘర్షణలు జరిగేవి. 2014 డిసెంబరు 4వతేది రాత్రి7గంటల సమ యంలో బాసుపల్లి హన్మంతు తన ఇంటికి వెళ్ళేక్రమంలో బాసుపల్లి అంజిలప్ప పాతగొడవలు మనసులోపెట్టుకొని గొడవకుదిగాడు. ఆసమయంలో బాసుపల్లి అంజిలప్ప కుమారులు ఏ1శ్రీనివాస్, ఏ2పాండు, అంజిలప్పలు కలిసి అక్కడికి వచ్చి హన్మంతుపై దాడి చేశారు. పాండు హన్మంతుని పట్టుకోగా శ్రీనివాస్ కట్టెలతో, అంజిలప్ప రాయితో హన్మంతు తలపై దెబ్బతీసిన ఫలితంగా హన్మం తు అక్కడిక్కడే మృతిచెందాడు. ఈఘటనపై అప్పటి ఎస్సై ఆర్.రమేష్ క్రైం నెం.150,2014,గా ఐపిసి,148,302,326,324,201,109, ప్రకారం కేసు నమోదు చేశారు. అప్పటి గౌరవన్యాయమూర్తి మంగళవారం నిందితులకు జీవితఖైదు,జరిమానావిధిస్తూ తీర్పునిచ్చారు. ఈకేసులో న్యాయసేవ అందిం చిన పబ్లిక్‌ప్రాసిక్యూటర్లు, నారాయణగౌడ్, వి.రవికుమార్,పి.సుధాకర్‌రెడ్డి, ఎస్సై ఆర్.రమేష్, ఇన్‌స్పెక్టర్ కె.శివశంకర్, ప్రస్తుత ధరూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిఎచ్.రఘురాములు, ఎస్సై అబ్దుల్ గఫార్, సిడిఓలు మహేశ్వర్‌రెడ్డి, బ్రీఫింగ్ అధికారి బి.వీరన్నలు సమష్టిగా కృషి చేశారన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**మేడ్చల్, మే 13. ప్రభాతవార్త:**
రోడ్డుప్రమాదంలో ఓవ్యక్తి మృతిచెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా, గుమ్మడిదల మండలం రాంరెడ్డిబావి గ్రామానికి చెందిన సామల దేవేందర్‌రెడ్డి (37) మేడ్చల్ మండలంలోని రాయిలాపూర్ గ్రామంలో హార్వెస్టర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారంరాత్రి బైక్‌పై ఇంటికి వెళుతుండగా ప్రమాదవశాత్తు బండమాదారం శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు రోడ్డుపక్కన గుంతలోపడి మృతిచెందాడు. మంగళవారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జాతీయ బి.సి లిబరేషన్ టైగర్ ఫోర్స్ వైస్ ప్రెసిడెంట్‌గా డా. చంద్రశేఖర్



చంద్రశేఖర్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య, ర్యాగఅరుణ్ తదితరులు

**హైదరాబాద్, మే 13,ప్రభాతవార్త:**
జాతీయ బి.సి లిబరేషన్ టైగర్ ఫోర్స్ వైస్ ప్రెసిడెంట్‌గా డా. చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఈమేరకు మంగళవారం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పి. ఆర్. కృష్ణయ్య ,జాతీయ బి.సి కొఆర్డినేటర్ ర్యాగా ఋషి అరుణ్ కుమార్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈసందర్భంగా డా.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆర్‌కృష్ణన్న పుట్టుకతోనే నాయకుడని ఆయన్ను ఏపార్టీ ఏనాయకుడు తయారు చేయలేదన్నారు. ఏపదవి లేకుండానే ప్రజా నాయకుడి ఎదిగి నాయకుడనే పదానికి కొత్త అర్థం సృష్టించారన్నారు. ప్రజల కోసం ప్రజల అభివృద్ధి కోసం పోరాడి కొత్తకొత్త స్కీములు పెట్టించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. చాలా మంది రాజకీయ పార్టీల చుట్టూ తమ తమ అభివృద్ధి కోసం స్వార్థంతో తిరుగుతారని కానీ ఆర్ కృష్ణయ్య ఉద్యమాలు, ప్రజల సమస్యల చుట్టూ, వాటి పరిష్కారాల కోసం తిరుగుతున్నాడన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, పేద ప్రజలు, ఉద్యోగులు, ఇలా అన్ని వర్గాల సమస్యలపై ఉద్యమాలు చేపట్టిన ఘనత కృష్ణన్నకే దక్కుతుదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బి.సి లిబరేషన్ టైగర్ ఫోర్స్ అధ్యక్షులు జి. రాజ్ గోపాల్ యాదవ్, జాతీయ బి.సి యువజన సంఘం ఉపాధ్యక్షులు కిశోర్ యాదవ్, నీల వెంకటేష్, కౌశిక్, వంశీ, బాలయ్య, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బోయిన్‌పల్లి మార్కెట్‌లో చెట్టు కింద వైద్య సేవలు



బోయిన్‌పల్లి మారె ్కట్‌లో చెట్టు కింద సేవలు అందిస్తున్న హెల్త్ సూపర్

**కంటోన్మెంట్,మే 13 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో ఆరోగ్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో హెల్త్ సూపర్ వైజర్ చెట్టు కింద వైద్యపరీక్షలు చేస్తూ సేవలు అందిస్తుంది. దేశంలో అతి పెద్ద కూరగాల మార్కెట్ యార్డుగా పేరొందిన బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో లక్షలాది రూపాయలు వెచ్చిం చి ఏర్పాట్లు చేసిన ఆరోగ్య ఉప కేంద్రం అందుబాటులో లేక పోవడంతో మార్కెట్‌లో పనిచేస్తున్న కూరగాయల వ్యాపారులు, హమాలీలు, మార్కెట్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు హెల్త్ సెంటర్ లేక పోవడంతో అక్కడ కెటాయించిన హెల్త్ సూపర్ వైజర్ మార్కెట్ యార్డు బయట చెట్టుకిందనే కూర్చొని ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తుంది. ఇప్పటికైనా మార్కెట్ ఉన్నతాధికారులు, పాలక మండలి చైర్మన్ ఆనంద్ బాబు ప్రత్యేక చొరవ తీసుకొని మూసి ఉన్న హెల్త్ సెంటర్‌లో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేేస్తున్నారు.

## నీటి సమస్యను పరిష్కరించాలని హన్మంత్‌రెడ్డిని కలిసిన ప్రజలు



హన్మంత్‌రెడ్డిని సత్కరించిన ప్రజలు

**పేట్ బషీరాబాద్, మే 13, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 132 డివిజన్ జీడిమెట్ల పరిధిలోని ప్రాగటూల్స్ వారు 32 సంవత్సరాలుగా అక్కడ 119 ఇండ్లకు పైగా నిర్మించుకున్నారు. ప్రస్తుతం అక్కడ నీటి సమస్యను తొలగించాలని మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి అతి త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రావణ్ కుమర్, ప్రసాదా రావు, రామ్ బాబు, వి. సుదర్శన్ రెడ్డి, బల్ రెడ్డి, ఎల్. సుదర్శన్ గౌడ్, పరమేశ్వర్ రావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మకుంటను సందర్శించిన స్థానిక మహిళలు



హైడ్రా చేపడుతున్న బతుకమ్మకుంట అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అంబర్‌పేట మహిళలు

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:**
మాజీ పిసిసి అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు చొరవతో అంబర్పేట్ నియోజకవర్గంలోని బతుకమ్మ కుంట పునర్నిర్మాణ పనులను హైడ్రా చేపడుతుండడం పట్ల స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఇన్నాళ్ళకి స్థానిక మహిళలు తాము బతుకమ్మ పండుగ రోజున పడే ఇబ్బందులు దూరమయ్యాయని, ఆనందాన్ని వ్యక్తం వ్యక్తం చేశారు.బతుకమ్మకుంటకు స్థానిక ప్రజలకు ఉన్న అనుబంధాన్ని వారు గుర్తుచేసుకున్నారు. గతంలో బతుకమ్మకుంటలో బతుకమ్మ వేడుకలను ఆడపడుచులు సంబరంగా జరుపుకునేవారని గుర్తుచేశారు. ఇన్నాళ్లకు వచ్చే బతుకమ్మ పండుగను ఈ బతుకమ్మ కుంటలో వైభవంగా జరుపుకునే విధంగా హైడ్రా పనులను వేగంగా జరుగుతుండడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మాజీ పిసిసి అధ్యక్షుడు వి.హనుమంతరావు,హైడ్రా కమిషనర్ రంగనాథన్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కల్వకుంట్ల కవిత విదేశాలలో బతుకమ్మను ఆడారు కానీ భాగ్యనగరంలో ఉన్న ఈ బతుకమ్మకుంటను పట్టించుకోలేదన్నారు.ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు దేవిరెడ్డి విజితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**జగద్గిరిగుట్ట, మే 13, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. మంగళవారం 126 జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవి హిల్స్ లో నూతనంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి పరిచామని, చేసిన అభివృద్ధిని చూసే నన్ను మూడవ సారి భారీ మెజారిటీ గెలిపించిన మీకు ఎల్లవేళలా కృతజ్ఞుడనై ఉంటానని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా భూదేవి హిల్స్‌తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు బాబు గౌడ్, విఠల్, శశిధర్, జైహింద్,



పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే వివేకానంద

తిరుమల్ రెడ్డి, మల్లా చారి, తిరుపతి, దినేష్, సత్యనారాయణ, మెట్ల శ్రీను, ఎర్ర లక్ష్మయ్య, బ్రహ్మానంద చారి, మహంకాళి, వెంకటేష్, అజం, ప్రభాకర్, ఆంజనేయులు, నాగరాజు, ముంతాజ్, నవీన్, రాజు, సురేష్, మధు, సోమయ్య, తారా సింగ్, మహిళా నాయకురాలు త్రివేణి, మంజుల, పార్వతీ, పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు బాలకృష్ణ, భూదేవి హిల్స్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పోటీ ప్రపంచంలో వృద్ధిలోకి రావాలంటే తగిన నైపుణ్యాలు పెంచుకోవాలి

**-తెలంగాణ యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ విఎల్‌విఎస్‌ఎస్.సుబ్బారావు**

**చిక్కడపల్లి, మే 13 ప్రభాతవార్త:**
ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సిద్ధంగా ఉండాలంటే తగిన నైపుణ్యాలు పెంచుకోవాలని తెలంగాణ యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ విఎల్‌విఎస్‌ఎస్.సుబ్బారావు అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 'తెలంగాణలో ఒక దృక్పథ నైపుణ్యం ఇంటిగ్రేటెడ్ విద్య"అంశంపై సదస్సు జరిగింది. విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ సరోజా వివేక్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ విఎల్‌విఎస్‌ఎస్.సుబ్బారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన స్కిల్ ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ వర్సిటీ ద్వారా యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాల్లో ముఖ్యపాత్ర పోషిస్తాయని చెప్పారు. డా. సరోజ వివేక్ మాట్లాడుతూ నేటి సమాజంలో స్కిల్ ఆధారిత విద్య



తెలంగాణ యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ విఎల్‌విఎస్‌ఎస్.సుబ్బారావును సత్కరించిన దృశ్యం

అత్యవసరమని, ప్రతి విద్యార్థి నైపుణ్యాలు నేర్చుకొని భవిష్యత్ తరాలకు ఆదర్శంగా ఉండేలా విద్యను అలవాటు చేసుకోవాలని అభిప్రాయపడ్డారు.కార్యక్రమ ఈ కార్యక్రమంలో రమణకుమార్, విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, హెచ్.ఓ.డీలు, అధ్యాపక బృందం, పెద్దఎత్తున పాల్గొని సెషన్ ను విజయవంతంగా ముగించారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లు : ఎస్ఈ సోమిరెడ్డి

**చార్మినార్,మే 13 ప్రభాతవార్త :**
విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండ అన్ని ఏర్పాట్లు చేశామని టిజిఎస్‌పిటిసిఎల్ ఎస్ఈ సోమిరెడ్డి అన్నారు.మిస్ వరల్డ్ హెరిటేజ్ వాక్ సందర్బంగా ఎస్ఈ సోమిరెడ్డి మంగళవారం విద్యుత్ శాఖాధికారులతో చార్మినార్,కిల్వత్ ప్రాంతాలలో పర్యటించి విద్యుత్ ఏర్పాట్లను పరిశీలించా రు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ చార్మినార్ వద్ద జరిగిన మిస్ వరల్డ్ 2025 హెరిటేజ్ వాక్‌ను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేశామని పాతబస్తీ రహదారులలో ఇబ్బందిగా ఉన్న కేబల్ వైర్లను తొలగించామని తెలిపారు.టిజిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్,చార్మినార్ ఎడిఇ సయ్యద్



కార్యక్రమంలో పాల్గొన్న టిజిఎస్‌పిటిసిఎల్ ఎస్ఈ సోమిరెడ్డి,చార్మినార్ డిఇ ఎం.శ్రీ ధర్,చార్మినార్ ఎడిఈ సయ్యద్ మక్సూద్

మక్సూద్‌తో పాటు పలువురు విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతీని ప్రతిబింబించేవి కళలు, శాస్త్రీయ నృత్యరీతులే

**-కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ బిడిఎల్ సిఎండి ఆత్మకూరి మాధవరావు**

**చిక్కడపల్లి, మే 13 ప్రభాతవార్త:** ఉన్నతమైన భారతీయ సంస్కృతీని ప్రతిబింబించే మన కలలను, శాస్త్రీయ సంగీత నృత్య రీతులను పరిరక్షించి భావితరాలకు అందజేయాలని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆత్మకూరి మాధవరావు అన్నారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నవ్య నాటక సమితి, అన్నమాచార్య మిషన్‌ల సంయుక్తాధ్వర్యంలో శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 617వ జయంతి కార్యక్రమమానికి ముఖ్యఅతిథిగా మాధవరావు హాజరై ప్రముఖ సంగీత విద్వాంసులు బ్రహ్మశ్రీ డాక్టర్ తాడేపల్లి లోకనాథ శర్మ ను "అన్నమాచార్య సంకీర్తనా గాన నిపుణ" బిరుదుతో సత్కరించి ప్రసంగించారు. వోక దేశం గుర్తింపు కళలు సంస్కృతి అని అన్నారు. అలాంటి కళలను పరిరక్షిస్తూ ప్రచారం చేస్తున్న లోకనాథ్ శర్మ దేశానికి గర్వకారణం అని ప్రశంసించారు. ముందుగా సంగీత కళాకారులు డాక్టర్ వై. రమాప్రభ, ద్విభాష్యం వి. ఎస్. ఎన్. మూర్తిల శిష్య బృందం అన్నమాచార్య సంకీర్తనా గానం పెరిట అన్నమయ్య కీర్తనలను ఆలపించి సభికులను అలరించారు. అనంతరం నృత్య గురువు సీతాప్రసాద్ లక్ష్మి బృం



ప్రముఖ సంగీత విద్వాంసులు బ్రహ్మశ్రీ డాక్టర్ తాడేపల్లి లోకనాథ శర్మ ను "అన్నమాచార్య సంకీర్తనా గాన నిపుణ" బిరుదుతో సత్కరిస్తున్న కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ బిడిఎల్ సిఎండి ఆత్మకూరి మాధవరావు

దమ్ (కొత్తగూడెం) "అన్నమయ్య కథ" సంగీత నృత్య రూపకాన్ని కను విందుగా ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలను పొందారు. వేదిక పై ఖజానా మరియు లెక్కల శాఖ ఉప సంచాలకులు జి వసుంధర గోదాలక్ష్మి చంద్ర శేఖర్ ధనుంజయ రాజిత్ ఆకుల ఆచార్య ఫణీంద్ర తదితరులు పాల్గొనగా వెమరాజు విజయ కుమార్ కార్యక్రమ పర్యవేక్షణ చేశారు నిర్వాహక సంస్థల ప్రతినిధులు వేమరాజు విజయ కుమార్, కామిశెట్టి గోదాలక్ష్మి, నిష్టల సుధామాల తదితరులు పాల్గొన్నారు.

## మాతృదినోత్సవ సభ



**చిక్కడపల్లి, మే 13 ప్రభాతవార్త:** తెలంగాణ స్త్రీ సేవా సంస్థ అధినేత శోభాపేరిందేవి ఆధ్వర్యంలో సోమవారం మాతృదినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఎస్ ఆర్ వృద్ధాశ్రమంలో వందలాది మంది వృద్ధులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారికి ఆరోగ్యానికి అవసరమైన అంశాలను వివరించడానికి యోగా గురువు శ్రీదేవి భారత్ యోగాచే యోగా కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ నృత్యకళాకారిణి యసస్వి, రీతేష్ భరత నాట్య, భరతనాట్యం, ఆశ్రమ సభ్యులను అడుగులు వేయించారు. విజయ్‌చంద్ర పుల్ జాల, శ్రీలక్ష్మి తెలంగాణ స్త్రీ సేవా సంస్థ సంస్థ ద్వారా వంద మంది పెద్దలకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో అధ్యక్షులు రచయిత్రి డా.గురజాడ శోభా పేర్ని దేవి కార్యదర్శి శ్రీమతి డీ హేమలత, కోశాధికారి శ్రీమతి శైలజ, అరుణ, శ్రీ వల్లి,లలిత రామస్వామి, నాగమణి పాల్గొని మాతృ దినోత్సవ కార్యక్రమాన్ని రక్తి కట్టిం చారు.

### పురోహితులకు నూతన వస్త్రాల పంపిణీ

**చిక్కడపల్లి, మే 13 ప్రభాతవార్త:** శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు పాలపర్తి సంధ్యారాణి ఆధ్వర్యంలో విద్యానగర్‌లో పురోహితులకు బుద్ధపూర్ణిమ సందర్భంగా నూతన వస్త్రాలు, ఇతర వస్తూవులను అందించే కార్యక్రమం జరిగింది. ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో పేదలకు, అర్చకులకు వీటిని అందించడం సంప్రదాయంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం పూర్వీకులు అందించిన సనాతన ధర్మం, ఆచారాలను ముందు తరాలకు తెలియజేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వేణు గీతిక, రమణ, ముక్కమాల భవాని, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

### నాలుగేళ్లు అయినా అల్మాస్‌గూడ కుంటల సుందరీకరణ పూర్తి కాదా: నవారు మల్లారెడ్డి

**సరూర్‌నగర్, మే 13 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో దాదాపు నాలుగు సంవత్సరాల క్రితం చేపట్టిన కోమటికుంట, పోచమ్మకుంట సుందరీకరణ పనులను నేటికీ పూర్తి చేయలేకపోవడం శోచనీయమని కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, 24వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి ఆరోపించారు. పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన అసంపూర్తి దశలో ఉన్న కుంటల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరీకరణ పనులు ప్రారంభించి సుమారు నాలుగు సంవత్సరాలు దాటినా సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పటికీ పనులు పూర్తి చేయకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అయితే తాము కాం గ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల క్రితమే కోమటికుంట, పోచమ్మ కుంటలకి సంబంధించిన సుందరీకరణ పనులు సక్రమంగా జరగడం లేదనీ.. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా స్థానిక ప్రజాప్రతినిధులతో కుమ్ముక్కై అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి వినతి పత్రం సమర్పించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ రెండు కుంటలకు సంబంధించిన సుందరీకరణ పనులకు ఎంత మొత్తం నిధులు కేటాయించారు.. కాంట్రాక్టర్‌కు ఇప్పటి వరకు ఎంత మేర బిల్లులు చెల్లించారు.. అనే దానిపై తాము అడిగితే కార్పొరేషన్ అధికారులు స్పందించడం లేదని మల్లారెడ్డి ఆరోపిం చారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల శివారు ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటలను కాపాడాలని కృతనిశ్చయంతో ఉన్నందున తాము ఇక్కడి చెరువులు, కుంటల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించ నున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇక్కడి చెరువులు, కుంటల సుందరీకరణ పనులను స్థానిక ప్రజాప్రతినిధి, అధికారులు పూర్తి చేయించలేని పరిస్థితిలో ఉన్నందున తాము కాంగ్రెస్ పార్టీ తరపున బాధ్యత తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు అల్మాస్‌గూడ కోమటి కుంట, పోచమ్మ కుంటల అసంపూర్తి పనులైన సుందరీ కరణ, వాకింగ్ ట్రాక్ తదితర వాటిని ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా త్వరితగతిన పూర్తి చేసేలా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి దృష్టికి అదే విధంగా జిల్లా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబులను కోరతామని మల్లారెడ్డి వెల్లడించారు.

## క్రీడలు యువత, ఫిట్‌నెస్ ఉన్నవారికే పరిమితం కాకూడదు

**-అన్ని వయస్సుల వాళ్లు పోటీల్లో పాల్గొనాలి**
**-భారత బాడ్మింటన్ కోచ్ పుల్లెంల గోపీచంద్**

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:**
హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) నిర్వహించిన నగరంలోని అతిపెద్ద ఇంటర్ కార్పొరేట్ స్పోర్ట్స్ టోర్నమెంట్ 202425లో ఇన్ఫోసిస్ ఓవరాల్ చాంపియన్‌షిప్ సొంతం చేసుకుంది. టీసీఎస్ రన్నరప్‌గా నిలవగా, సింక్రోనీ మూడో స్థానం సాధించింది. గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో భారత బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు అవార్డులు అందజేశారు. ఇన్ఫోసిస్ గచ్చిబౌలి వీపీ, డీసీ హెడ్ రఘు బొడ్డుపల్లి, హైసియా అధ్యక్షుడు ప్రశాంత్ నందెల్ల కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ క్రీడలు యువత, ఫిట్‌నెస్ ఉన్నవారికే పరిమితం కాకూడదని, అన్ని వయసుల వారూ పాల్గొనే సంబరంగా మారాలని అభిప్రాయపడ్డారు. రాబోయే సంవత్సరాల్లో ఈ టోర్నమెంట్‌ను మరింత విస్తృతం చేసి, అందరినీ కలుపుకునేలా నిర్వహించాలని హైసియాను కోరారు. 2024 సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు జరిగిన ఈ టోర్నమెంట్‌లో 60 హైసియా సభ్య కంపెనీల నుంచి 2 వేల మందికి పైగా ఉద్యోగులు 15 క్రీడల్లో పోటీపడ్డారు. ఇన్ఫోసిస్ ఎస్‌టీపీ, ఎస్ఈజెడ్ క్యాంపస్‌లలో జరిగిన



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న బ్యాడ్మింట్ కోచ్ పుల్లెంల గోపీచంద్

ఈ ఈవెంట్‌లో 270కి పైగా జట్లు పాల్గొని నగరంలోనే అతిపెద్ద క్రీడా వేడుకగా నిలిచింది. క్రికెట్ లో అత్యధికంగా 42 జట్లు పోటీపడ్డాయి. పురుషుల క్రికెట్ లో రియల్‌పేజ్ విజేతగా నిలవగా, ఇన్ఫోసిస్ రన్నరప్, టీసీఎస్ తృతీయ స్థానాలు సాధించాయి. మహిళల బాక్స్ క్రికెట్ లో జేపీ మోర్గాన్ ట్రోఫీ నెగ్గగా, సింక్రోనీ రన్నరప్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్‌లో ఇన్ఫోసిస్ (విజేత), టీసీఎస్ (రన్నరప్), కబడ్డీలో ఇన్ఫోసిస్ (విజేత), హెచ్ఎస్‌బీసీ (రన్నరప్), క్యారమ్స్‌లో ఇన్ఫోసిస్ (విజేత), హెక్సాగన్ (రన్నరప్), చెస్ లో టీసీఎస్ (విజేత), డి.ఇ.షా (రన్నరప్) సత్తా చాటాయి. ఇతర పోటీల్లో ఇన్ఫోసిస్ (బాస్కెట్‌బాల్), టీసీఎస్ (టేబుల్ టెన్నిస్), సింక్రోనీ (స్నూకర్),ఏడీపీ (పూల్),ఇన్ఫోసిస్ (స్క్వాష్), సింక్రోనీ (ఫుట్‌బాల్),ఒరాకిల్ (త్రోబాల్), డి.ఇ.షా(టెన్నిస్) విజేతలుగా నిలిచాయి.

## 'గోమాత శతకం గ్రంథావిష్కరణ

**చిక్కడపల్లి, మే 13 ప్రభాతవార్త:** రాబోయే తరాలకు సనాతన ధర్మాలతో పాటు గోవు ఆవశ్యకత, గో సంరక్షణ శతకాలను తెలియజేయాల్సిన అవసరం ఉందని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ అన్నారు. సాధన సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగింది. ఇది 40వ శతకం కావడం విశేషం. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య టి.గౌరీశంకర్ హాజరై ఆవిష్కరించి గ్రంథాన్ని గోమాత సేవాట్రస్ట్ చైర్మన్ లక్ష్మణరేఖ డాక్టర్ గోపాలకృష్ణకు అంకితమిచ్చి ప్రసంగించారు. డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ నేటి తరానికి గోవు ఆవశ్యకత, గో సంరక్షణ వైశిష్ట్యంపై అవగాహన కలిగించాలన్నారు. విద్యార్థులకు గోమాత శతక పద్యపోటీలను నిరన్వహించాలన్నారు.కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ఎర్రాప్రగడ మల్లికార్జునరావు, ఆర్.విశ్వేశ్వరరావు, అంకితస్వీకర్త డాక్టర్ ఎన్.గోపాలకృష్ణ, సాధన నర్సింహాచార్య పాల్గొనగా సభకు ప్రముఖ గాయకుడు చింతలపాటి సురేశ్ గోసేవ రాగమా లికను ఆలపించారు.

## మన సైనిక సత్తా ప్రపంచానికి తెలిసింది

**-బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గానుగపాటి సూర్యనారాయణ శర్మ**

**చిక్కడపల్లి, మే 13 ప్రభాతవార్త:** ఆపరేషన్ సిందూర్‌తో మన సైనిక సత్తా ప్రపంచానికి తెలిసిందని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గానుగపాటి సూర్యనారాయణ శర్మ అన్నారు. ఎంచుకున్న లక్ష్యాలను వంద శాతం గురితప్పకుండా పేల్చివేయటం భారత సైన్యానికే సాధ్యమైందన్నారు. దాడులకు ఎంచుకున్న లక్ష్యాన్ని విమానాలను గాని, సైనికులను గాని నష్టపోకుండా నూటికి నూరు శాతం సాధించటం ద్వారా సైన్యం తన సత్తాను నిరూపించుకుందని చెప్పారు. తక్కువ సమయంలో మనం అనుకున్నది సాధించినట్లు తెలిపారు. రఫేల్, తేజస్ యుద్ధ విమానాలపై అవగాహన ఉందని, . శ్రీనగర్, అవంతీపొరా, పఠాన్కోట్, అమృత్సర్, ఆదంపూర్, అంబాలా, బఠిండా తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారని, భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు, తాజాగా కాల్పుల విరమణకు అవగాహన కుదరటంపై, మనపై పాకిస్థాన్ అసత్యాలు ప్రచారం చేసిందన్నారు. పాకిస్తాన్‌కు దేశానికి పోరాడే సత్తా లేదని, తన బలహీనత బయటపడకుండా ఉండాలంటే త్వరగా ఒక పరిష్కారం కావాలన్నారు. . ఉద్రిక్తత ఎంత ఎక్కువ కాలం కొనసాగితే ఆ దేశానికి అంత ఎక్కువ నష్టం అని, . అందుకే కాల్పుల విరమణకు పాకిస్తాన్ తొందరపడిందని, ఆ దేశానికి గట్టి గుణపాఠం చెప్పటమే మన ప్రధానోద్దేశం. దాన్ని సాధించామని, కాబట్టి ఇంకా సాగదీయాల్సిన అవసరం లేదు. అందుకే ఒప్పందం కుదిరే అవకాశం ఏర్పడిందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా భారత ఆర్మీకి పూర్తి అధికారాలు ఇవ్వడం జరిగిందని, పాక్ ఒక్క బుల్లెట్ ప్రయోగిస్తే మనవైపు నుంచి గుండ్ల వర్షం కురిపించండని స్పష్టంగా ఆదేశాలివ్వడం జరిగిందన్నారు.

## శివాజీనగర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాణా ప్రతాప్‌నగర్ బస్తీ శ్రీసరస్వతి ఉన్నత పాఠశాల ఎస్ఎస్సీ 200025 పూర్వ విద్యార్థుల సమ్మేళనం.

**యూసుఫ్‌గూడ, మే 13, ప్రభాతవార్త :**
బోరబండలోని శివాజీనగర్ మరియు రాణా ప్రతాప్‌నగర్ బస్తీల మధ్యలో ఉన్న శ్రీసరస్వతి ఉన్నత పాఠశాల ఎస్ఎస్సీ పూర్వ విద్యార్థులు 200025మధ్య చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం పూర్వ ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ వారి ఉన్నతికి తోడ్పాటు అందించిన పాఠశాల యాజమాన్యం ఫౌండర్ మరియు చైర్‌పర్సన్ డాక్టర్ ఆంజనేయులు, ప్రిన్సిపల్ సరస్వతిని పూర్వ విద్యార్థులు సన్మానించి వారి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా క్లాస్ రూమ్స్‌లో ఆనాటి జ్ఞాపనకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ముత్యంరాజు, బబ్లూ గౌడ్, మహేష్, శివపార్వతి, ప్రసన్న, వీణా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదానికి గురైన ఆర్టీసీ డ్రైవర్ మృతి

**తుర్కయంజాల్ మే 13(ప్రభాతవార్త)**
తురకయంజాల్ మున్సిపాలిటీ చౌరస్తాలో ఈనెల 9వ తేదీన రోడ్డు దాటుతూ ప్రమాదానికి గురైన ఆర్టీసీ డ్రైవర్ మేతరి కుమార్ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. తుర్కయంజాల్ కు చెందిన మేతరి కుమార్ ముషీరాబాద్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్ గా ఉద్యోగం చేస్తున్నాడు. అయితే ఈ నెల 9వ తేదీన ఉద్యోగం ముగించుకొని తుర్కయంజాల్ కు వచ్చిన మేతరి కుమార్ తుర్కయంజాల్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా ఇద్దరు వ్యక్తులు బైక్ పై వచ్చి ఢీకొట్టడంతో కుమార్ క్రిందపడి తీవ్రగాయాలు అయ్యాయి చికిత్స నిమిత్తం నగరంలోని ఆసుపత్రికి తరలించగా తలపై బలమైన గాయాలు తగలడంతో చికిత్సను అందించారు. అయితే మంగళవారం కుమారు ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుమార్ మృతి పట్ల ఆర్టీసీ ఉద్యోగులు, సంఘీభావం ప్రకటించారు తుర్కయంజాల్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండడం ఇబ్బందిగా ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు అభిప్రాయించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్కడ తుర్కయంజాల్ చౌరస్తాలో సిగ్నల్ పాయింట్ పెట్టాలని ప్రజలు తెలియజేశారు

## యూఎస్ జాతీయ క్యారమ్స్ పోటీలు విజయవంతం



మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (మాట) వ్యవస్థాపకులు శ్రీనివాస్ గనగోని, ప్రతినిధులు ప్రదీప్ సామల,కిరణ్ దుద్దగి, సురేష్ జానా,విజయ్ భాస్కర్ తదితరులు

**హైదరాబాద్, మే 13 ప్రభాతవార్త**
మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (మాటా), యునైటెడ్ స్టేట్స్ క్యారమ్ అసోసియేషన్ (యూఎస్సీఏ), యూనిఫై స్పోర్ట్స్ అకాడమీ ఫౌండేషన్ (యూఎస్ఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన 29వ యూఎస్ నేషనల్స్ క్యారమ్స్ అసోసియేషన్ 2025 పోటీలను విజయవంతంగా నిర్వహించినట్లు మాటా ప్రతినిధులు తెలిపారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట వ్యవస్థాపకులు శ్రీనివాస్ గనగోని, సహ వ్యవస్థాపకులు ప్రదీప్ సామల, అధ్యక్షుడు కిరణ్ దుద్దగి, స్పోర్ట్స్ డైరెక్టర్ సురేష్ జానా, ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్, గౌరవ సలహాదారులు రఘురామ్ వీరమల్లు, యూఎస్‌సీఎఫ్ వాలంటీర్ శ్రీచరణ్ ఖజానా, అతుల్ భావే, షకీల్ తదితరులు మాట్లాడారు. డబుల్స్, సింగిల్స్, జూనియర్ విభాగాల్లో పోటీలు జరిగాయని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశామన్నారు. శారీరక, మానసిక ఉల్లాసాన్ని కల్గించే క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. క్రీడల్ని తమ జీవన విధానంలో భాగం చేసుకోవాలని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజికల్ షో ఆకట్టుకున్నాయన్నారు. విజయకుమార్, కిరణ్ రమణ, ప్రదీప్, శ్రీనివాస్, పవన్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## వ్యక్తి అదృశ్యం..

**జీడిమెట్ల, మే 13, ప్రభాతవార్త**
ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపాటి రామబ్రహ్మం దేవేందర్ నగర్‌లో నివాసం ఉంటూ కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు. రామబ్రహ్మం పెద్ద కుమారుడు పెద్దపాటి వరప్రసాద్ (36) కార్పెంటర్‌గా పని చేసేవాడు. సోమవారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో తన ఇంట్లో నుండి వెళ్ళిపోయాడు. వరప్రసాద్‌కు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ అని వస్తుంది. ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, చుట్టు ప్రక్కలవారిని, బంధువులను అడిగి ఆచూకి లభించలేదు. ఈ మేరకు పోలీసులను ఆశ్రయించగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మరో కేసులో వ్యక్తి అదృశ్యం..

**జీడిమెట్ల, మే 13, ప్రభాతవార్త**
మరోకేసులో ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోలంటి హేమ వెంకట లక్ష్మీ, వెంకటేశ్వర రావులు భార్య భర్తలు. వారు గత 8 నెలల క్రితం జీవనోపాధి కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా నుండి వలస వచ్చారు. కాగ వెంకటేశ్వరరావు (35) ఏప్రిల్ నెల 30వ తేదీ ఉదయం 9గంటల ప్రాంతంలో పనికి వెళ్ళి మరల తిరిగి ఇంటికి వచ్చి, అన్నం తిని ఎవరికి చెప్పకుండా రెండు జతల బట్టలు, మేస్త్రీ పనికి సంబంధించిన వస్తువులు తన వెంట తీసుకుని వెళ్ళిపోయాడు. వెంకటేశ్వరరావుకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ అని వస్తుంది. ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, చుట్టు ప్రక్కలవారిని, బంధువులను అడిగి ఆచూకి లభించలేదు. ఈ మేరకు పోలీసులను ఆశ్రయించగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ట్యూబ్‌లైట్లతో వ్యక్తిపై దాడి... కేసు నమోదు.

**బేగంపేట మే 13,ప్రభాతవార్త :**
బేగంపేట లో జరిగిన ఓ పెళ్లి ఊరేగింపు (బారాత్)లో ట్యూబ్ లైట్లను పట్టుకుని నృత్యం చేస్తున్న యువకులు కొందరు అదే లైట్లతో ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి.బేగంపేట భగవంతాపూర్‌లో ఈ నెల 11వ తేదీన అర్ధరాత్రి విజయ్‌కుమార్ అనే వ్యక్తి తన కుమార్తె పెళ్లి సందర్భంగా ఊరేగింపునిర్వహించారు.ఇదే ఊరేగింపులో నిఖిల్,శివ,విజయ్‌కుమార్‌లతో పాటు మరికొందరు ట్యూబ్ లైట్లను తిప్పుతూ డాన్స్ చేస్తున్నారు.అదే సమయంలో అటుగా వచ్చిన నాచారం వెంకటేష్ అనే వ్యక్తికి ట్యూబ్‌లైట్ తగిలింది.ఇదేమిటని బాధితుడు ప్రశ్నించడంతో నిఖిల్,శివ,విజయ్‌కుమార్‌తో పాటు మరి కొందరు ట్యూబ్‌లైట్లతో దాడి చేసి తీవ్రంగా కొట్టారు.బాధితుడికి తీవ్ర రక్తస్రావం అయింది.వెంటనే సమీపంలోని వారు ఆస్పత్రికి తరలించారు.బాధితుడు ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పాఠశాల ఏకరూప దుస్తుల్లో నాణ్యత పాటించాలి

### డిఆర్డిఎ ఐకెపి ఎపిడి సూర్యారావు



టైలర్లతో డిఆర్డిఏ సెల్స్ ఎపిడి సూర్యారావు

**యాచారం,మే13, ప్రభాతవార్త :** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల ఏకరూప దుస్తుల పంపిణీ కోసం ఐకెపి పొదుపు సంఘాల ద్వారాకుట్టించిపంపిణీ చేయనున్నారు.యాచారం మండల కేంద్రంలోగల ఐకెపి సర్ఫ్ కేంద్రాన్ని జిల్లా డిఆర్డిఏ సర్ఫ్ పిడి సూర్యరావు మంగళవారంసందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, .విద్యార్థిని విద్యార్థులకు దుస్తుల కుట్టుమిషన్ ద్వారా చేపట్టే ప్రక్రియను దగ్గరదగ్గర మూడునంబర్స్ ప్రకారం కుట్టు వెయ్యాలన్నారు. నాణ్యమైన దారాలు, జిప్పులు,బటన్స్ వాడాలని సూచన చేశారు. మండల పరిధిలోని 46 ప్రభుత్వ పాఠశాల లోని 3625మంది విద్యార్థులకు ఉచిత ఏకరూప దిస్తులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందులో బాలురు 1715 మంది, బాలికలు 1910 మంది ఉన్నట్లు తెలిపారు. మహిళా సంఘాల ద్వారా కుట్టు కార్యక్రమం ఏర్పాటుచేసి ఒకడ్రెస్‌కు75 రూపాయల చొప్పున చెల్లిస్తున్నట్లు తెలిపారు. స్వయంసహకార సంఘాలలో ఐదు కేంద్రాలను ఎంచుకున్నట్లు తెలిపారు. నందివనపర్తి, యాచారం,గున్గల్, మేడిపల్లి, మాల్‌గ్రామాలలో టైలర్లకుఏకరూపు దుస్తులకోసంసామాగ్రిని అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఏపిఎం సాంబశివుడు, సీసీగణేష్ ,రాజు, అశోక్,జయలక్ష్మి, స్వరూపలతో సమావేశమై దుస్తుల కుట్టు మిషన్లను టైలర్లతో పర్యవేక్షణలోఉంటూనాణ్యత పాటించాలని నిర్లయం చేయరాదని సూచనచేశారు.నిర్ణీతకాలంలోపాఠశాలలవిద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించేందుకు ప్రయత్నించా లని అన్నారు. టైలర్లతో మాట్లాడుతూ నాణ్యతపై నిర్లక్ష్యంచేస్తే మరోసారి అవకాశం ఉండదని చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు.

## హనుమాన్ జయంతి శోభాయాత్రలో పాల్గొనాలి

### హిందూ సంఘాల పిలుపు



మాట్లాడుతున్న హిందూ సంఘాల నాయకులు

**కొత్తూర్, మార్చి13,ప్రభాతవార్త :** భక్తిభద్రత ఐక్యతకు ప్రతీకగా కొత్తూర్‌లో హనుమాన్ శోభయాత్రపై సన్నహక సమావేశం. ఈనెల 22వ తేదీన జరగబోయే హనుమాన్ జయంతి సందర్భంగా కొత్తూర్ హనుమాన్ దేవాలయంలో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో భజరంగ్‌దళ్ సభ్యులు, వివిధ హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.... హనుమాన్‌జయంతి సందర్భంగా కొత్తూర్‌లో మున్సిపాలిటీలో జరగనున్న శోభాయాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొని హిందూ ఐక్యతను ప్రపంచానికి చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. భక్తిభద్రత, శాంతి పరిరక్షణ అంశాలను దృష్టిలోఉంచుకునిశోభాయాత్రను విజయవంతంగా నిర్వహించే ఒదుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈశోభాయాత్రలో పెద్ద ఎత్తున్న భక్తులు పాల్గొనాలని,హనుమాన్‌భక్తితోకూడినఈవేడుకను ఘనంగా జరుపు కోవాలన్నారు. శివకుమార్‌చారి, నరేష్‌చారి, శేఖర్‌గౌడ్, నరసింహ, మురళి, ప్రశాంత్,హర్షయాదవ్,సందీప్‌సింగ్,జశ్వంత్ ఉన్నారు.

## బిసి సేన అయ్యవారిపల్లి మహిళా కమిటీ ఎన్నిక



మహిళా కమిటీని ఎన్నుకుంటున్న జాతీయ బిసిసేన నాయకులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, మే13 :** ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామంలో బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ముఖ్య అతిథులుగా బీసీసేన జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వు సుధాకర్, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు మేకల వెంకటేష్, నందిగామ మండల ఉపాధ్యక్షుడు మలగాసి నర్సింహులు, జిల్లేడ్‌చౌదరిగూడ మండల మహిళా అధ్యక్షురాలు ప్యాటజయ,పట్టణప్రధానకార్యదర్శివసంతలు పాల్గొన్నారు. ఈసందర్భంగాపలువురు మాట్లాడుతూ బీసీలు విద్య, వైద్యం,రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎదగాలని తెలిపారు. బీసీల హక్కులను సాధించుకునే దిశగా నడవాలని కోరారు. జాతీయ సేనప్రతిసమస్యలో బిసిలవెంట ఉండి ముందుకు నడిపిస్తుందని అన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేతలు



**మొయినాబాద్,13,ప్రభాతవార్త:**వ్యవసాయఅధికారి అనురాధ అధ్వర్యంలో రైతుముంగిట్లోశాస్త్రవేతలుకార్యక్రమం ఏర్పాటుచేశారు, ప్రొఫెసం జయశంకర్‌వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి రైతుముంగిట్లో శాస్త్రవేత్త లకార్యాక్రమానికివ్యవసాయశాస్త్రవేతలు డా.( పగతికుమారి ,డా. రవీందర్, ఎస్‌ఆర్‌ఎఫ్ వినయ్, పిహెచ్‌డి వ్యవసాయ విద్యార్థి నలబోలు వందన తోలకట్ట గ్రామంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యాక్రమం సందర్భంగా రైతులతోసంభాషించడంజరిగింది,రైతులతో మాట్లాడుతూ రైతు సమస్యలు తెలుసుకొని వాటికి అనుగుణంగా పంట మార్పిడి, భూసార పరీక్షలు ఎరువులవాడకం నీటిని వాడు పద్దతుల వంటి అంశాలపైన సూచనలు సలహాలు ఇచ్చారు,వ్యవసాయఅధికారి అనురాధ, ఎఈవో కుమార్, మాజి సర్పంచ్ బి. సత్యనారయణ, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

**తలకొండపల్లి మే13, ప్రభాత వార్త:**తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన దేశం రవీందర్ రెడ్డి గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకోవడం జరిగింది. చికిత్స అనంతరం సిఎంసహాయనిధికిదరఖాస్తు చేసుకోగా అతనిక ప్రభుత్వంత రఫున.60.000/.వేలరూపాయలు మంజూరు కావడం జరిగింది. ఈచెక్కునుకల్వకుర్తి శాసనసభ్యులు(ఎమ్మెల్యే)కసిరెడ్డి నారా యణరెడ్డి చేతుల మీదుగా మంగళవారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే నివాసంలో చెక్కునుచుక్కాపూర్‌గ్రామస్తులకు అందివ్వడం జరిగింది. దిశరిపోర్టర్ చంద్రకుమార్ ఏఎంసీ డైరెక్టర్ అంజయ్య గుప్తా, మాడుగుల బట్టు కిషన్ రెడ్డి,డిసిసికార్యదర్శిరవీందర్‌యాదవ్, బ్లాక్‌కాంగ్రెస్‌జర్నల్‌సెక్రెటరీ డిగ్రీకృష్ణ,తలకొండపల్లిగ్రామకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు రమేష్, యూత్ కాంగ్రెస్‌నాయకులుశ్రీనివాస్‌రాంపూర్‌కృష్ణ,పయాజు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ రోల్‌మోడల్

**ఆమనగల్లు,మే,ప్రభాతవార్త :**పేదలకుఅండగా నిలబడేందుకు లయన్స్‌క్లబ్ స్వచ్ఛంధసంస్థ దశాబ్దాలుగాసమాజ సేవలో పాలుపంచుకుంటుందని లయన్స్‌క్లబ్‌జిల్లాచైర్మన్ నటరాజ్‌యాదయ్యగుప్త అన్నారు. అంతర్జాతీయ స్థాయిలోచేపడుతున్న లయన్స్‌క్లబ్ సేవలు నేడు ఎన్నో స్వచ్ఛంధ సంస్థలకురోల్‌మాడల్‌గా నిలిచిందని ఆయన కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు,లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ సిహెచ్‌సి ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఆప్తమాలిక్‌మెండెటి చంద్రశేఖర్‌గుప్తతో కలిసి యాదయ్యగుప్త ప్రారంభించారు.

ఈ సందర్భంగా యాదయ్యగుప్త మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆఫ్‌ఆమనగల్లు మూడుదశాబ్దాలుగా నిరంతరంసమాజ సేవలు కొనసాగించడం గర్వ కారణ మన్నారు. స్వచ్ఛంధ సంస్థల చేపడుతున్నసేవలు నిరుపేదలకు అండగా నిలుస్తాయని చెప్పారు.అనంతరంకంట వైద్యనిపుణులు ఎం. చంద్రశేఖర్‌గుప్త మాట్లాడుతూ ప్రతిఒక్కరు వ్యక్తిగతంగా కంటిఆరోగ్య సూత్రాలను పాటించాలని సూచించారు. 35ఏళ్ళు నిండిన ప్రతిఒక్కరూ ప్రతి 6 మాసాలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలి సూచించారు. కాగా ఉచిత కంటి పరీక్ష శిబిరంలో 72 మంది పాల్గొని నేత్రపరీక్షలు పొందగా 45 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించినట్లు క్లబ్ పిఆర్‌ఓ ఎంఎ పాష తెలిపారు. వీరికి




ఆమనగల్లులో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న నటరాజ్ యాదయ్యగుప్త

లోఎనుగొండ పట్టణంలోని లయన్ రాంరెడ్డి ఐ హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్లు చేయించడానికి ప్రత్యేక వాహనంలో తరలించినట్లు క్లబ్ పిఆర్‌ఓ పాషా వెల్లడించారు.లయన్స్ క్లబ్‌సంయుక్త కార్యదర్శి ఎంగళి బాలకృష్ణ, సభ్యులు కర్నాటి కొండల్ రెడ్డి, పిఆర్‌ఓ పాషా, గుజ్జరి శ్రీను, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ అధికారికి అదనపు బాధ్యతలు



అదనపు బాధ్యతలుస్వీకరిస్తున్న అధికారి కిష్టయ్య

**కేశంపేట మే 13 ప్రభాతవార్త :** కేశంపేట ఇంచార్జ్ ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి సెలవులపై యూఎస్‌ఏ వెళ్తున్న సందర్భంగా ఆయన స్థానంలో పంచాయతీ అధికారి కిష్టయ్యకు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు జిల్లా పరిషత్ రంగారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారనిమంగళవారంఅదనపు బాధ్యతలు స్వీకరించినట్లు కిష్టయ్య తెలిపారు.

## గిరిజన గురుకులంలో ఇంటర్ ప్రవేశాలు

**కొడంగల్,మే 13ప్రభాతవార్త:**గిరిజరన గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత ్సరం మిగిలిన సీట్ల కోసం మరోసారి థరఖాసు చేసుకునేందుకు అవకాశంకల్పించారు.ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటర్‌ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 10వ తరగతి ఉత్తీర్ణత చెందిన బాలురు ధరఖాస్తు చేసు కోవచ్చున్నారు.వీరికి ఈనెల 15న హయత్ నగర్‌లో గల పీవీటీజీ బాలు రకళాశాలలో కౌన్సిలింగ్‌నిర్వహించడం జరుగుతుందనితెలిపారు.విద్యార్థులు బదిలీ దృవపత్రం, పదిలోసాధించి నమార్కులు,స్టడీకండక్ట సర్టిఫికెట్, కుల,ఆదాయ దృవీకరణ పత్రాలు,ఆధార్ స్పోర్ట్స్, అర్బన్,పిహెచ్‌సీ,3 కలర్ ఫోటోలు రెండుజతల జిరాక్స్ కాపీలు తీసుకొని హజరు కావాలని తెలిపారు.

## బ్యాంకర్లతో సమావేశం



**జిల్లెడుచౌదరిగూడ, మే, 13,ప్రభాతవార్త:** రాజీవ్ యువ వికాసం రుణాలపై వివిద బ్యాంకు మేనెజర్లు, పంచాయితీ కార్యదర్శులతో సోమవారం ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్‌ఆద్వర్యంలోప్రత్యేకసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రభుత్వ గ్రామీణ ప్రాంతాల్లోని నిరు పేద యువత కోసంరాజీవ్ యువవికాసం ద్వార రుణాలు ఇచ్చేందుకు ప్రణాళికలు తయారు చేసింది.ఇందులోభాగంగాలబ్ధిదారులు యూనియన్ బ్యాంకు, ఎస్‌బీఐ, తెలంగాణగ్రామీణ బ్యాంకులకు రుణాల కోసం ధరఖాస్తు చేసుకున్నారు లబ్ధిదారులుధరకాస్తుచేసుకున్న వివరాలను సంబంధిత బ్యాంకు మేనెజర్లకు అందజేసినట్లు ఆయనతెలిపారు. ధరకాస్తు దారుల సిబిల్‌ను వారు పరిశీలించనున్నట్లు ఆయన పెర్కొన్నారు. ఎంపిఓ హన్మంత్‌రెడ్డి, ఏపిఎం నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నేతల పరామర్శ



**ఆమనగల్లు, మే13, ప్రభాత వార్త:** ఆమనగల్లు మండలానికి చెందిన బిజెపి సీనియర్‌కార్యకర్తచింతలపల్లి లక్ష్మారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆమనగల్లు మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్లు చెక్కల లక్ష్మణ్, కృష్ణయాదవ్, నాయకులు రవి రాథోడ్,రామస్వామి సోమవారం బాధితున్ని పరామర్శించారు.లక్ష్మారెడ్డిఆరోగ్యంఅందుతున్నవైద్యంగురించివీరు వైద్యులను అడిగితెలునుకున్నారు.మెరుగైనవైద్యంతోత్వరగాకోలుకోవాలనివారు ఆకాంక్షించారు.

## డయాల్సిస్ సేవలు మరింత పెంపు

**కొడంగల్,మే 13ప్రభాతవార్త:** కొడంగల్ ఏరియా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న డయాల్సిస్‌సేవలు మరింత పెంచినట్లు ఆసుపత్రి సూపరిండెంట్ చంద్రప్రియ తెలిపారు.ఈసందర్భంగాఆమెమాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రస్తుతం కొనసాగుతున్న3షిఫ్టులనుపెంచుతూనేటి నుంచి 4 షిఫ్టులు కొనసాగుతాయని ఆమెపేర్కొన్నారు.నాలుగవ షిప్టు రాత్రి 8 గంటలకు ప్రారంభం అవుతుందని అన్నారు.షిఫ్టుకు 4 గంటలు చొప్పున ఇకపై 16 గంటల పాటు డయాల్సిస్ సేవలుకొనసాగుతాయని ఈ సేవలనువినియోగించుకోవాలనికోరారు. ట్రస్టు నిర్వహకులు డాక్టర్‌రాంబాబు, శ్రీనివాస్,ప్రమోద్,వీరేషం తదితరులున్నారు.

## ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష

**మేడ్చల్, మే13.ప్రభాతవార్త:**పాలిసెట్ ప్రవేశ పరీక్ష మంగళవారం మేడ్చల్‌లో ప్రశాంతంగా జరిగింది. పరీక్ష రాసేందుకు మేడ్చల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, స్ఫూర్తి జూనియర్ కాళాశాల, ఎన్‌ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల, హైటెక్ పాఠశాల, హైటెక్ రెసిడెన్సియల్ పాఠశాల, ఆక్స్‌ఫోర్డ్ పాఠశాల, డెల్లీ వరల్డ్ పాఠశాల, ఎస్‌ఎస్‌జీ పాఠశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 2078మంది విద్యార్థులకు గాను 1798 మంది పరీక్ష రాయగా280 మంది గైర్హాజరయ్యారని పాలిటెక్నిక్‌కళాశాల ప్రిన్సిపల్ అరుందతి తెలిపారు.

## సౌత్‌జోన్ పోటీల్లో హ్యాండ్‌బాల్ జట్టుకు తృతీయ స్థానం

**ఘట్‌కేసర్,మే13,ప్రభాతవార్త:** టిఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్ ఆర్‌డిసి హ్యాండ్‌బాల్ నుంచి సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొన్న తెలంగాణ జట్టు క్రీడాకారులు తృతీయ స్థానం సాధించారని కోచ్ పద్మినిగుప్తా తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ అంకుశాపూర్ ప్రిన్స్‌టన్ కళాశాలలో ఉన్న టిఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్ ఆర్‌డిసి హ్యాండ్‌బాల్ అకాడమీ నుంచి ఎం.త్రివేణి-వరంగల్ వెస్ట్, ఈశ్వర్య-వరంగల్ వెస్ట్,బి.కల్పన-సంగారెడ్డి,బి.జ్యోతి-ఇబ్రహీంపట్నం,బి.మీనాక్షి -కొత్తగూడెం, బి.నందిన-కొత్తగూడెంలు తెలంగాణ జట్టుకు ఎంపికై ఆడాలని తెలిపారు. తమిళనాడులోని తిరువన్నామలైలోని అరణిలో ఈనెల 9 నుంచి 12 వరకు జరిగిన 40వ హెచ్‌ఎఫ్‌ఐ సౌత్‌జోన్ పురుషుల, మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలలోవీరు పాల్గొన్నారని తెలిపారు. సౌత్‌జోన్ స్థాయిలో ఉత్తమ ఆటతీరును ప్రదర్శించిన క్రీడాకారులు 3వ స్థానం పొంది బహుమతి అందుకున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ స్నేహలత, డాక్టర్ రామలక్ష్మణ్, శేషులు విద్యార్థినులకు అభినందించారు.

# ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, మే 13 ప్రభాతవార్త :** రోగుల పట్ల అంకితభావంతో సేలందిస్తున్న నర్సులను మాధవన్ జీ ఆసుపత్రి గౌరవించింది. వారి సేవలు ఎంతో విలువైనవని ప్రశంచిసింది. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణం కృతజ్ఞతాభావంతో నిండిపోయింది. తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న ఈ వైద్య సిబ్బందికి మాధవన్ జీ ఆసుపత్రి తరుపున ప్రత్యేక కార్యక్రమాలుఏర్పాటుచేసి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ మాధవన్ జీ ఆసుపత్రి డైరెక్టర్ ప్రభాకర్ దుబాసి, డైరెక్టర్ మొహమద్ జాఫర్ మాట్లాడుతూ..

మానర్సుల ఆరోగ్యవ్యవస్థకువెన్నెముక వంటివారని తెలిపారు. వారి సంక్షేమం మాకుఅత్యంత ప్రాధాన్యమైనదని వివరించారు. ప్రతి నర్సు భద్రమైన, ప్రోత్సాహకరమైనవాతావరణంలోఎదగాలని, ప్రతిరోగికి అత్యుత్తమ మైన వైద్యం అందాలని కోరుకుంటున్నామన్నారు.నర్సులు అందిస్తున్న సేవకేవలం వైద్యం మాత్రమే కాదు,మనమందరం కలిసి పనిచేయడానికి వారిసహకారం ఎంతో అవసరమని ఈసందర్భంగా గుర్తుచేశారు.అనంతరం నర్సెస్‌కు బహుమతు లను డైరెక్టర్ నారపంగా వెంకన్న, మాధవన్ జీ ఆసుపత్రి జనరల్ మేనేజర్ కె.గణేష్‌లు ప్రధానం చేశారు.

ఈ కార్యక్రమంలో వైద్యులు రమాకాంత్, వరుణ్, ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట్ రెడ్డి, డైరెక్టర్ నాగేశ్వర్‌రావు, మాధవన్ జీ ఆసుపత్రి నర్సులు, ఆవేర్ రూరల్ ఆసుపత్రి నర్సులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ నర్సుల దినోత్సవం వేడుకలకు జరుపుకుంటున్న మాధవన్ జీ, ఆవేర్ రూరల్ ఆసుపత్రి వైద్య నర్సులు, వైద్యులు తదితరులు.

# జడ్పీస్కూలు పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**మొయినాబాద్,మే13 ప్రభాతవార్త :** ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం. మొయినా బాద్ మున్సి పాలిటిలోని హిమా యత్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల 2009, 10లో 10వ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు చదువుపూర్తి చేసుకొని తరువాత ఎవరి దారుల్లో వారు వివిధ రంగాల్లో స్థిరపడి 15 ఏళ్ళ తరువాత వారు పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళ నం మంగళవారం అజీజ్‌నగర్ పరిధిలోని ఓరిసార్టులో ఏర్పాటు చేసుకున్నారు.




హిమాయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాల పూర్వవిద్యార్థులు

చిన్నతనంలో కలుసుకున్న పాత స్నేహితులు అప్యాయ పలక రింపులు ఆత్మీయ కరచాలనాలు ఘనంగా పూర్వ విద్యార్థులువారిఒక్కరినొక్కరు, పలకరించుకొనివారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు.

ఈసందర్భంగా వారికి విద్యా బుద్దులు చెప్పిన గురువులను వారి కార్యాక్రమానికి హవ్వానించి వారికి ఘణంగా సత్కారించి జ్ఞాపికాలను అంద జేశారు, పూర్వవిద్యార్థులు 15 ఏళ్ళ తరువాత కలుసు కొవడంతో గతాన్నినెమువేసుకొని ఆనందరంగా గడిపారు.

ఒక్కరితో ఒక్కరు వార బాల్యాన్ని గుర్తుచేసుకొని ఆనందం తో నవ్వుకుంటు సంతోషంగా గడిపారు, వారి బాల్యాన్ని గురు చేసుకుంటు వారి ఆనందానికి అవధులులేవు.

ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు తాజ్‌బాబు ,అంజయ్య, కృష్ణారెడ్డి, కళవతి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## యశోదకు జానపద పురస్కారం




కొప్పు యశోదకు జానపద పురస్కారం అందజేస్తున్న అతిథులు

**యాచారం,మే 13, ప్రభాతవార్త :**యాచారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామానికి చెందిన కొప్పు యశోదకు జానపద పురస్కారం అందజేశారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రజా కళావేదిక, డైరెక్టర్‌ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్, కల్చర్ అఫైర్స్ వారి ఆధ్వర్యంలో జరిగిన మన పల్లె జానపదం జాతర కార్యక్రమంలో తాడిపర్తి గ్రామానికి చెందిన ఫోక్ సింగర్ కొప్పు యశోద కు జానపద పురస్కారం లభించింది షీల్డ్ ప్రశంస పత్రం తో సన్మానం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి హాజరైన 300 మంది జానపద కళాకారులకు పాటకు పట్టాభిషేకం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా డాక్టర్ మురళీధర్ హరిసర్వోత్తమనాయుడు,ప్రముఖకవిప్రిన్సిపాల్ డాక్టర్ సినారాయణ స్వామీ, సినీగీతారచయిత కవి సురేంద్ర పాల్గొన్నారు. ప్రజాకళా వేదిక అధ్యక్షుడు అరవ జయపాల్ మాట్లాడుతూ.. జానపదాలు జనజీవన రంజకాలు జగతికిజీవనాడులుఅనిపేర్కొన్నారు. ఈసందర్భంగా తాడిపర్తికి చెందిన యశోదకు పురస్కారం లభించడం పట్ల తాడిపర్తి గ్రామ ప్రజలు బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## వీరన్నగమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలి

### ఆలయ కమిటీ సభ్యుడు ముల్తంకర్ శివాజీ

**కేశంపేట మే 13 ప్రభాతవార్త :** ఆరెకటి కళా కుల దైవం విరనాగమ్మ కళ్యాణమహోత్స వంవేడుకలు నేటి (బుధవారం) నుండి మొదలవుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ముల్తుంకర్ శివాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ మొదటి రోజు కంకరాదరణ సాయంత్రం ఐదు గంటలకు పుట్టదనితో పూజా రాత్రి 9 గంటలకు దుర్మలయ్య పూజ, పోలుదారం చుట్టూట శుక్రవారం ఉదయం ఏడు గంటలకు వీరనాఘమ్మ దేవత ఊరేగింపుగా గంగపూజకుబయలుదేరుతుంది అనంతరం అలంకరణతో ఆలయానికి చేరుకుంటుంది, మధ్యాహ్నం 12 గంటలకు అన్న విస్తరణ కార్యక్రమం, మధ్యాహ్నం రెండు గంటలకు వీర నాగమ్మ తల్లికళ్యాణ ఉంటుందిఅధికసంఖ్యలోప్రజలుపాల్గొని అమ్మవారి కళ్యాణాన్ని తిలకించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యుడు ముల్తుంకర్ శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు.

## మృతుడి కుటుంబానికి దాతలు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**కేశంపేటమే13ప్రభాతవార్త:** కేశంపేటమండలకేంద్రానికి చెందిన కడియాల వెంకటయ్య ఇటీవల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులతో కలిసి తిరుపతి యాత్రకు వెళ్లారు, తిరిగి ఇంటికి వస్తున్న గా ఆంధ్ర ప్రదేశ్‌లోని కడప జిల్లా కేంద్రంలో భోజనం చేసేందుకు వెళ్లారు, ఆ క్రమంలో వెంకటయ్యతప్పిపోయాడు,రోడ్డుపైనడుచుకుంటూ వస్తున్న వెంకటయ్యను గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.వెంకటయ్యమృతిచెందినవిషయాన్ని గ్రామస్తులద్వారావిషయం తెలుసుకున్న కేశంపేట తాజా మాజీ జెడ్పిటిసివి శాల శ్రవణ్‌రెడ్డి సహృదయంతో మృతుడి కుటుంబ సభ్యులకు గ్రామస్తుల ద్వారా 5000 రూపాయలను అందజేశారు. కేశంపేట మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు గుండ్రాతి రమణ గౌడ్ 5000 వేల రూపాయలను ఆర్థికసహాయంగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేసి వెంకటయ్య కుటుంబసభ్యులనురమణ గౌడ్ పరామర్శించారు. పాండుగౌడ్, ఎడమహరికిషన్‌రెడ్డి,రొయ్యల ఆంజనేయులు, కడియాల రవి,అన్నంగారి చెన్నయ్య, భైరమోనిచంటి, దిద్యాల ఉజ్వల్,పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి సాయం అందజేత



**కేశంపేటమే13,ప్రభాతవార్త:** కేశంపేటమండల కేంద్రానికిచెందిన వృద్ధురాలు రుకలిముత్తమ్మ మృతి చెందారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న కేశంపేట తాజా మాజీ జెడ్పిటిసి తండా విశాలా శ్రవణ్ రెడ్డి 5000వెల రూపాయలు,మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు.కేశంపేట మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు గుండ్రాతి రమణ గౌడ్ 5000 వెల రూపాయలను మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థికసహాయం అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు జూలపల్లి అనసూయ ముదిరాజ్, రొయ్యల ఆంజనేయులు ముదిరాజ్, ఎరుకలిపోచయ్య,ఎరుకలిగణేష్,ఎరుకలిజంగమ్మ,ఎరుకలిపావమ్మ పాల్గొన్నారు.

## రూ. ఐదులక్షలు ఎల్‌ఓసి మంజూరు



**తలకొండపల్లి మే13, ప్రభాతవార్త:** రంగారెడ్డిజిల్లా,కల్వకుర్తి నియోజకవర్గం, తలకొండపల్లి మండలం,.. అంతారం.. గ్రామానికి చెందిన ..ఎండి ఆరిఫ్ కూతురు సమ్రీన్ బేగం గుండె చికిత్స కోసం నిమ్స్ హాస్పిటల్ లో 20 లక్షల అవుతుందని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు తెలపడంతో వారు స్థానిక శాసనసభ్యులు కసి రెడ్డి నారాయణరెడ్డి గారి దగ్గరికి తీసుకువెళ్లి నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్సకోసం ఎల్‌ఓసి కావాలని విన్నవించుకోవడం జరిగింది. వెంబడే స్పందించిన శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి గారు ఎల్‌ఓసి మంజూరి కోసం లెటర్ ఇవ్వడం జరిగింది వారి సహకారంతో ఈరోజు మంజూరైన ఐదు లక్షలఎల్‌ఓ సి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకురి ప్రభాకర్ రెడ్డి ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి తో కలిసి సమ్రీన్ బేగం తండ్రి ఆరిఫ్ కు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జూలపల్లి మాజీ సర్పంచ్ వి. జైపాల్ రెడ్డి, చుక్కాపూర్ మాజీ ఎంపీటీసీ డి యాదయ్య, వెల్జాల్ మాజీ ఉపసర్పంచ్ ఎం. ఏ. అజీజ్, అంతరం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం మహేష్, ఆసిఫ్,నాగేష్‌పాల్గొన్నారు.

## రేణుక జమదగ్నిల కల్యాణోత్సవం



శ్రీరేణుకజమదగ్నిల కల్యాణోత్సవ వేడుకల దృశ్యం

**ఘట్‌కేసర్ రూరల్ 13, ప్రభాతవార్త:**
పోచారం మున్సిపల్ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో మంగళవారం శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవతాసహిత రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా అమ్మవారి కల్యాణోత్సవ వేడుకలు ఘనంగా కన్నుల పండుగగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకులు చైర్మన్ ఈగ లలితాకృష్ణా ముదిరాజ్ ఆధ్వర్యంలో శ్రీరేణుకాఎల్లమ్మజమదగ్నిల కల్యాణోత్సవ వేడుకలు కన్నులపండుగగా జరిగాయి. ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా అమ్మవారి విగ్రహప్రతిష్ఠాపన, అభిషేకం, ఎల్లమ్మజమదగ్నిల కల్యాణోత్సవం, అగ్నిగుండాల వంటి పూజాకార్యక్రమాలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్, స్థానిక మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గొంగళ్ల మహేశ్‌కురుమ, మాజీ సర్పంచ్ గొంగళ్ల మాధవిబాలేశ్ కురుమ, బిజెపి నాయకులు అచ్చిని నర్సింహ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలుచేశారు. ఈసందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించి పూజలుచేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇటికాల కృష్ణారెడ్డి, ఆలయ నిర్వాహకులు ఈగ లాస్యమధుముదిరాజ్, ఈగ నందినిరాముముదిరాజ్, వేద పండితులు రామమూర్తిశర్మ, వేణుమాధవ్‌శర్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చిరుతల రామాయణం వీధి నాటక ప్రదర్శన



వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

**కొందుర్గు, మే 13, ప్రభాతవార్త:**
కొందుర్గు మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ ప్రాంగణంలో ప్రదర్శిస్తున్న చిరుతల రామాయణం వీధినాటకాన్ని మంగళవారం కూడా ప్రదర్శించారు. ఈనాటకప్రదర్శనకు మాజీ వైస్ ఎంపిపి రాజేష్‌పటేల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుతల రామాయణం లాంటి పురాతనచరిత్ర కలిగిన వీధినాటకాలను నేటి సమాజానికి వివరించడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. వీధి నాటకాలను ప్రోత్సహించి, కళాకారులకు ప్రతి ఒక్కరు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈసందర్భంగా వీధినాటక కళాకారులను ఆయన అభినందించారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈసరి సత్యనారాయణ, వివిధపార్టీల నాయకులు గుండేడ్ వేణు గోపాల్, సున్నాల అంజయ్య, యాదగిరి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**మేడ్చల్, మే 13, ప్రభాతవార్త:**
మేడ్చల్ మండలంలోని గోసాయిగూడ గ్రామంలో అచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ అధ్వర్యంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో నిర్వహించిన సభలో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వ్యవసాయ సాగులో యూరియా, డిఏపి, రసాయన ఎరువులు అధిక మోతాదులో వాడటం వల్ల పంటతో పాటు భూమికి నష్ట వాటిల్లుతుందని తెలిపారు. అదేవిధంగా సాగు విధానంలో పంట మార్పిడి చేయడం ద్వారా చీడపీడల ఉధృతిని నివారించవచ్చని అన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వామి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుదాన్ష్, ఎఎంసి డైరెక్టర్ రాజు, వ్యవసాయ అధికారి అర్చన, విస్తీర్ణ అధికారి తేజశ్విని, రైతులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు కల్గకుండా ధాన్యం సేకరించాలి



రైతులతో మాట్లాడుతున్న పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణబాయి

**ఘట్‌కేసర్, మే 13, ప్రభాతవార్త:**
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా తగిన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా పౌరసరఫరాల మేనేజర్ సుగుణబాయి పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్, మాదారంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాలువస్తే ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని ఆమె సూచించారు. రైతులనుంచి ధాన్యంసేకరించి సకాలంలో డబ్బులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. ఆమె వెంట డిఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, ఘట్‌కేసర్ మండల వ్యవసాయాధికారి ఎంఎ.బాసిత్, ఏఈఓ జగదీష్, సెంటర్ల ఇంచార్జ్‌లు ప్రవీణ్, విక్రమ్‌లు ఉన్నారు.

## రాకంచెర్లలో శ్రీతిరుమలనాథస్వామి ఉత్సవాలు

**-దర్శించుకున్న ఎమ్మెల్యే**

**పూడూరు, మే 13, ప్రభాతవార్త:**
పూడూరు మండలపరిధిలోని రాకంచెర్లలో వెలసిన శ్రీతిరుమలనాథ స్వామి (యోగానంద లక్ష్మీనర్సింహస్వామి)వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారంరాత్రి శ్రీతిరుమలనాథస్వామివారి కళ్యాణం, రథోత్సవం కార్యక్రమాలు అంగరంగవైభవంగా జరిగాయి. ఈసందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన భక్తులు భారీసంఖ్యలో పాల్గొని బాజాభజంత్రీల మధ్య శ్రీస్వామివారి రథాన్నిలాగేందుకు పోటీపడ్డారు. మంగళవారం ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కమ్లీబాయి పెంటయ్యలతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయగా, బిజెపి పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతీకిరణ్ బూనేటి తదితరులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

# వీరభద్రనగర్ కాలనీకి సిసి రోడ్డు మంజూరు

**-చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వెల్లడి**



సిసి రోడ్డు వేసేందుకు కాలనీలో పర్యటించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, మే 13, ప్రభాతవార్త:**
చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని వీరభద్రనగర్ కాలనీకి సిసి రోడ్డును మంజూరు చేస్తున్నట్లు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వెల్లడించారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని వీరభద్రనగర్ కాలనీని స్థానికనాయకులతో కలిసి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పరిశీలించారు. ఈసందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ వీరభద్రనగర్ కాలనీకి సిసి రోడ్డును మంజూరు చేయాలని స్థానికులు ఉడుత రఘు విన్నవించారని, ఇందుకు స్పందించి కాలనీవాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సిసి రోడ్డును మంజూరు చేస్తున్నామన్నారు. యాక్సిస్‌బ్యాంకునుండి మైసమ్మ గుడి వరకు సిసి రోడ్డు నిర్మించేందుకు ఎన్ని నిధులైనా మంజూరు చేస్తామన్నారు. వీరభద్రనగర్ కాలనీలోని ప్రతివీధిలో సిసిరోడ్డు పనులకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మర్పల్లి క్రిష్ణారెడ్డి, మంగళి యాదగిరి, ఉడుత రఘు, మద్దెల చింటూ, వడ్ల శ్రీనివాస్‌చారి, తోల్‌కట్ట మాజీ ఎంపిటిసి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పైపు లైన్ లీకేజి...కలుషితం అవుతున్న నీరు



కలుషితమవుతున్న మంచినీరు

**ధారూరు, మే 13, ప్రభాతవార్త:**
గ్రామంలో ఇంటింటికి సరఫరా అయ్యే పైపులైన్ లీకేజీ అయి తాగునీరు కలుషితమవుతున్నా పట్టించుకునే నాథుడు లేరంటూ మండల పరిధిలోని నాగారంగ్రామంలోని కుంట కాలనీవాసులు వాపోతున్నారు. వారం రోజులైనా ఇప్పటివరకు ఎవరు మరమ్మతులు చేయడం లేదంటున్నారు. అయితే గ్రామ పంచాయతీ సిబ్బంది మరమ్మతుల కోసం లీకేజీ వద్ద తవ్వి వదిలేశారు. దీంతో గుంతలో నీరు నిలబడి నీరంతా కలుషితమై ఇంటి వద్ద నాళాల్లో మురికి నీరు వస్తోందన్నారు. ఒక వ్యక్తి సైతం మద్యం మత్తులో అందులో పడి తీవ్రంగా గాయపడ్డాడని, అయినాకూడా ఎవరు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పైపులైన్ కు మరమ్మతులు చేసి నీరు కలుషితం కాకుండా మంచినీరు అందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# అమర వీరులకు నివాళి..



ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎంఏ, ఇతర సంఘాల నాయకులు

**వికారాబాద్, మే 13, ప్రభాతవార్త:**
దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులకు ఆపరేషన్ సిందూర్ సంఘీభావ యాత్రను మంగళవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. వీర జవాన్ల త్యాగాల ు గుర్తు చేసుకుంటూ అమరులైన జవాన్లకు అశ్రునివాళ్లు అర్పించుట కొరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని బిజెపి జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని కుల సంఘాలు అన్ని రాజకీయ పార్టీలు వివిధ సంఘాలు, మాజీ సైనికులు, న్యాయవాద సంఘాలు, వ్యాపార సంఘాలు, అందరూ కలిసి ఈసందర్భంగా జవాన్లకు నివాళులు అర్పించారు. భారత సైన్యానికి సంఘీభావము తెలిపారు. పుష్పమాలలు నినాదాలతో కార్యక్రమం మిన్నంటింది. పట్టణంలోని ఆలంపల్లి వీర హ నుమాన్ టెంపుల్‌లో పూజా కార్యక్రమం నిర్వహించి తదనంతరం ఆలంపల్లి కమాన్ దగ్గర ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటోకి పూలమాల అర్పించి అక్కడి నుండి ప్రారంభమై ఎన్టీఆర్ చౌరస్తాలో వీరమరణం పొందిన అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈకార్యక్రమంలో సుమారుగా వెయ్యి మందికి పైగా పాల్గొన్నారు.

## ఉద్యమ నేత ఈటలపై నోరు జారితే ఊరుకునేది లేదు

**-మాధవరం కాంతారావు**

**కెపిహెచ్బి కాలనీ, మే 13, ప్రభాతవార్త**
మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ కూకట్ప ల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు తీవ్రంగా ఖండించారు. మంగళవారం కూకట్పల్లి అసెంబ్లీ బిజెపి కార్యాలయంలో అయన మాట్లాడుతూ ఈటెల రాజేందర్‌పై మాట్లాడే అర్హత జగ్గారెడ్డికి లేదని, సుమారు ఐదు సంవత్సరాల క్రితం బాచుపల్లిలోని మేడికుంట ఎఫ్.టీ. ఎల్ పరిధిలో నిర్మించిన రెండు అపార్టుమెంట్లు ఒక కమ్యూనిటీ హాల్ వస్తుందని ఆరోపిస్తూ ఆ అపార్ట్మెంట్‌లలో నివసిస్తున్న దాదాపు 80 కుటుంబాలను ఖాళీ చేయమని ఎం.ఆర్.ఓ. ఆదేశించడాన్ని వ్యతిరేకి స్తూ, ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు వారి కుసంస్కారానికి నిదర్శనమని అన్నారు. నాడు జగ్గారెడ్డి, పిసిసి అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా కాంతారావు గుర్తు చేశారు. కాంగ్రె స్ హైకమాండ్ సైతం అపాయింట్మెంట్ ఇవ్వడం లేదని, కూరలో కరివే పాకులా తయారైన తన పరిస్థితిని నుండి బయటపడడానికే రేవంత్ రెడ్డిని ప్రసన్నం చేసుకోవడానికి జగ్గారెడ్డి ఇలాంటి నాటకాలు ఆడుతున్నాడని దుయ్యబట్టారు. ఉద్యమ నేత ఈటెల రాజేందర్‌పై నోరు జారితే సహించబోమని వాటి పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని ఈ సందర్భంగా కాంతారావు హెచ్చరించారు. ఈ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డెపల్లి రాజేశ్వరరావు, సూర్యరావు, నాగరాజు, బిజెపి, బిజెవైయం నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**-జంపనప్రతాప్**

**కంటోన్మెంట్, మే 13 ప్రభాతవార్త:**
ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. మంగళవారం 1వ వార్డులోని బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్ ప్రాంతాల్లో ఆయన పృటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను, హెల్త్,ఇంజనరీంగ్, సిఈఓలో పరిశీలించిన సత్వరమే పరిష్కారం లేదన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సిఈఓ మధుకర్ నాయక్ దృష్టికి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో విద్యార్థుల ఉత్తమ ప్రదర్శన

**గన్‌ఫౌండ్రి, మే 13ప్రభాతవార్త:**
అంతర్జాతీయ కరాటే పోటీల్లో అబిడ్స్‌లోని సుజాత హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి సత్తాచాటారు. ఈనెల 9వ తేది నుంచి 11 వరకు మలేసియా లో నిర్వహించిన21వ అంతర్జాతీయ ఒకిసవాగాజు/ఆర్వైయు ఇపోసిటి ఒపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో పోటీల్లో సుజాతహైస్కూల్‌కు చెందిన 3వ తరగతి విద్యార్థిని చత్రిక సిన్రా, 7వ తరగతి విద్యార్థి ఎం.ఇతన్‌రాజ్‌లు కరాటే కోచ్‌వైఆర్.శివకుమార్ నేతృత్వంలో పోటీల్లో పాల్గొన్ని అత్యద్భుతమైన ప్రదర్శన కనబర్చి చేరోక బ్రౌంజ్ పథకాన్ని సాధించారు. ఫ్రిట్జ్ వెండ్లాండ్ స్థాపించిన ప్రపంచ కరా సమాఖ్య అధ్యక్షు లు, మలేషియా పార్లమెంట్ సభ్యులు వియాచెస్లవ్ టిమోఫీన్ ముఖ్య అతిథిగా విచ్చేసి అంతర్జాతీయ ఒకినావాగోజెలు బహుమతులను అందచేశారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# మాల్‌ను సందర్శించిన డిప్యూటీ కమిషనర్లు



గ్రామపంచాయతీలో పర్యటించిన అదనపు కమిషనర్‌లు, డిపిఓ, డిఎల్పిఓ, ఎంపిడివో ఎంపివో కార్యదర్శి

**యాచారం, మే 13, ప్రభాతవార్త:**
యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామ పంచాయతీ జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైన సందర్భంగా జిల్లా అదనపు కమిషనర్లు వెస్లీ, సురేష్‌మోహన్‌లు మంగళవారం సందర్శించారు. ఇన్చార్జ్ ఎంపిడివో శైలజ, ఎంపిఓ శ్రీలత ఆధ్వర్యంలో మాల్‌లో జిల్లా అధికారులు పర్యటించి గ్రామంలోని పరిస్థితులను, అభివృద్ధి పనులను పరిశీలించారు. కమిషనర్లు డిపిఓ, డిఎల్పిఓ అదనపు కమిషనర్లతో గ్రామంలో పర్యటించి గ్రామ కార్యదర్శి రాజుతో మాట్లాడి గ్రామంలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ శుచి, శుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచన చేశారు. జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నికైన సందర్భంగా గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని, సందర్శకులకు ఆదర్శంగా నిలిచేలా చేయాలని కోరారు. భవిష్యత్తులో మాల్ గ్రామపంచాయతీని జాతీయస్థాయిలో వివిధ ప్రాంతాల నుండి సందర్శకులు ఇక్కడికి వచ్చి సందర్శించే అవకాశం ఉందని పేర్కొన్నారు.




మాట్లాడుతున్న ప్రొబిషనరీ ఎస్ఐ ఆసీఫ్ అలీ

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రొబిషనరీ ఎస్ఐ ఆసీఫ్ అలీ**

**చిన్నకోడూర్, మే 13, ప్రభాతవార్త:** ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చిన్నకోడూర్ ప్రొబిషనరీ ఎస్ఐ ఆసీఫ్ అలీ అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద కోడూర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళా రక్షణ కోసం ఉన్న చట్టాలను గురించి వివరించారు. షీటీమ్ ద్వార ర్యాగింగ్, ఈవిటీజింగ్, ఫోక్సో, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి తెలిపారు. మహిళలు, ప్రజలు అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే అంతమంచిదన్నారు. ప్రతీ తల్లితండ్రులు వారి పిల్లల నడవడికను గురించి ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. మహిళలను ఎవరైనా వేదింపులకు గురిచేస్తే అపహేలనగా మాట్లాడితే డయల్ 100లేదా 8712667434 నెంబర్లకు సమాచారం ఇచ్చి సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, ఫీల్డ్ ఆఫీసర్ లత, షీటీమ్ బృధం కిషన్ , మమత, లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ఈటల గురించి మాట్లాడే హక్కు జగ్గారెడ్డికి లేదు

**-మామిండ్ల నాగు ముదిరాజ్**

**గజ్వేల్, మే 13 (ప్రభాతవార్త):** ఉమ్మడి రాష్ట్రంలో సమైక్యవాదులకు తొత్తుగా ఉన్న జగ్గారెడ్డికి ఈటల రాజేందర్ గురించి మాట్లాడే హక్కులేదని బిజెపి గజ్వేల్ నియోజకవర్గ నాయకుడు మామిండ్ల నాగుముదిరాజ్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పదవుల కోసం పూటకో పార్టీ మారుస్తూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడే జగ్గారెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. ఈటల రాజేందర్ పనిచేసే పార్టీ కోసం, పార్టీ కార్యకర్తల కోసం కష్టపడతారని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో విద్యార్థులు, ఉద్యమకారులు జైలులో ఉంటే తన సొంత ఆస్తులు అమ్మి తెలంగాణ ఉద్యమానికి ఖర్చుపెట్టిన గొప్ప నాయకుడు అన్నారు. ఎంతో మంది పేద విద్యార్థులకు తన సొంత ఖర్చులతో చదువు చెప్పిస్తున్నారని తెలిపారు. అలాంటి ఈటల రాజేందర్‌పై జగ్గారెడ్డి అణుచిత వ్యాఖ్యలు చేస్తే బిజెపి కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

## సిఎం సహాయనిధి చెక్కుల అందజేత

**చిన్నశంకరంపేట, మే 13, ప్రభాతవార్త:** మండల పరిధి సూరారం గ్రామానికి చెందిన కిషన్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. సిఎం సహాయనిధి దరఖాస్తు చేసుకోగా 32 వేల రుపాయల చెక్కు మంజూరైంది. మంగళవారం కాంగ్రెస్ నాయకులు సీఎం సహాయనిధి చెక్కును కాంగ్రెస్ నాయకులు రాజ్ కుమార్‌గౌడ్ బాధిత కుటుంబానికి అందించారు. ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదన్నారు. చెక్కు మంజూరుకు సహకరించిన మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నర్సాపూర్‌లో...

**నర్సాపూర్, మే 13 ప్రభాతవార్త :** పేదలకు ఆపత్కాల సమయంలో ఆదుకునేది ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) అని పిసిసి ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో నర్సాపూర్, హత్నూర మండలాలకు చెందిన 51 మంది పేద లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి( సీఎంఆర్ఎఫ్ ) కింద మంజూరైన మొత్తం 23 లక్షల 87 వేల విలువగల చెక్కులను ఆవుల రాజిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ మేరకు నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామానికి చెందిన వంటల నరసింహారెడ్డి తండ్రి మాణిక్య రెడ్డికి మంజూరైన చెక్కును సైతం ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ నుంచి వచ్చే సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు నిదర్శనం పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి(సిఎంఆర్ఎఫ్) అందించడమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ పథకాలను సమర్థవంతంగా అందించేందుకు ఇదే ఉదాహరణ అని పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న చింతకుంట గ్రామ నాయకులు ఏపుగారి శ్రీనివాస్, నరసింహారెడ్డి, ప్యాట మహేష్, ప్రభాకర్, శ్రీకాంత్‌రెడ్డి, పట్లోళ్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలకు భరోసా సిఎంఆర్ఎఫ్ : అవుల రాజిరెడ్డి

**హత్నూర, మే 13, ప్రభాతవార్త :** మండలం పరిధిలోని పన్యాల కొన్యాల, దౌల్తాబాద్, దేవులపల్లి, పల్పనూరు సాధు ల్ నగర్, తదితర గ్రామాలకు చెందిన 51 లబ్ధిదారులకు సంబంధించిన 1107500 విలువగల సీఎం ఆర్అ ఎఫ్ చెక్కులను నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి మంగళవారం క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో హత్నూర మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కే. కృష్ణ, తదితరులు పాల్గొన్నారు

## ముగిసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం

**సదాశివపేట, మే 13, ప్రభాతవార్త:** పట్టణంలోని రవీంద్ర మోడల్ ఉన్నత పాఠశాలలో గత నెల 25న ప్రారంభం అయిన వేసవి శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసాయి. పక్షం రోజుల పాటు కొనసాగిన వేసవి శిక్షన శిబిరంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 65 మంది విద్యార్థులు శిక్షణను అందుకున్నారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు ఆర్ట్ కుట్లు, అల్లికలు, మెహింది, డాన్స్ అంశాలపై శిక్షణ అందుకున్నారు. ఆర్ట్‌ను రాజశేఖర్, అల్లికను విజయలక్ష్మి, మెహిందిని ఎస్‌కె అంజుమ్, డాన్స్‌ను మైథిలిలు శిక్షణలు ఇచ్చారు. శిక్షణ అందుకోవడంతో ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందచేశారు. కార్యనరకమంలో ఎంఈఓ శంకర్, ఎంఆర్పిస్ సిబ్బంది అక్బర్, రాశేశ్వర్, మల్లేశం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా సోమన్నగారి లక్ష్మక్క 4వ వర్ధంతి

**నర్సాపూర్, మే 13, ప్రభాతవార్త :** టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి, దివంగత నేత సోమన్నగారి లక్ష్మక్క ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ చిలుముల సుహాసినిరెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లో సోమన్నగారి లక్ష్మక్క 4వ వర్ధంతిని ఆమె భర్త సోమన్నగారి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్పర్సన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సోమన్న గారి రవీందర్ రెడ్డిలు నర్సాపూర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి స్వర్గీయ సోమన్నగారి లక్ష్మక్క చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆవుల రాజిరెడ్డి, చిలిముల సుహాసినిరెడ్డి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల కోసం సోమన్న గారి లక్ష్మక్క ఎంతో కృషిచేసి పేదలకు సేవ చేశారని అన్నారు. ఈ మేరకు ఆమె పేద ప్రజలకు చేసిన సేవలు మరువలేని అని ఆమె సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా స్వర్గీయ సోమన్న గారి లక్ష్మక్క ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, లక్ష్మీకాంతం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నాయకులు రాధాకృష్ణ గౌడ్, శ్రీశైలం యాదవ్, ఎద్దు మలేషియాదవ్, కృష్ణ, దుర్గేష్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



లక్ష్మక్క చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం